# జర్నలిస్ట్ డైలీ
తెలుగు దినపత్రిక

SV6 NEWS
సమగ్ర సమాచార వారధి

సంపుటి : 11 సంచిక -121 మంగళవారం 22-10-2024 పేజీలు -8 వెల.రూ 3




## ప్రపంచానికి ఆశాకిరణంగా భారత్

- ఆర్థిక ఇబ్బందుల్లో సమర్థ పనితీరు
- దేశం ప్రతి రంగంలో శరవేగంగా అభివృద్ధి
- 'ది ఎన్డీటీవీ వరల్డ్ సమ్మిట్'లో మోడీ

న్యూఢిల్లీ,
ప్రపంచం మొత్తం కొవిడ్, యుద్ధాలు, ఆర్థిక సంక్షోభాలతో ఇబ్బంది పడుతున్న వేళ కూడా మన దేశంలో 'భారత్ శతాబ్ది' గురించి ఆలోచిస్తున్నారని ప్రధాని మోదీ అన్నారు. ఆయన 'ది ఎన్డీటీవీ వరల్డ్ సమ్మిట్'లో ప్రారంభోపన్యాసం చేశారు.

-మిగతా 3 లో

# పోలీస్ కుటుంబాలను ఆదుకుంటాం

- దేశ భద్రత, ప్రజల రక్షణలో పోలీసుల పాత్ర ఎనలేనిది
- పజలు ప్రశాంతంగా ఉంటున్నారంటే పోలీసులే కారణం
- శాంతిభద్రతలతోనే రాష్ట్రానికి పెట్టుబడి అవకాశాలు
- మరణించిన పోలీస్ కుటుంబాలకు 2కోట్ల వరకు సాయం
- అమరపోలీసులకు నివాళి అర్పించిన సీఎం రేవంత్ రెడ్డి



రాష్ట్ర అభివృద్ధిలోనూ పోలీసులదే కీలక బాధ్యత

హైదరాబాద్,
శాంతి భద్రతలు, నిఘా విషయంలో తెలంగాణ పోలీసుల పాత్ర కీలకమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశ భద్రత, ప్రజల రక్షణలో పోలీసుల పాత్ర ఎనలేనిదన్నారు. అమరులైన వారి కుటుంబాలను ప్రభుత్వం

-మిగతా 3 లో



## గ్రూప్-1 పరీక్షల్లో జోక్యం చేసుకోలేం

- మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు సుప్రీం నిరాకరణ
- యధాతథంగా గ్రూప్ పరీక్షల నిర్వహణ

న్యూఢిల్లీ
తెలంగాణ గ్రూప్-1 అభ్యర్థుల పిటిషన్‌పై జోక్యం చేసుకునేందుకు, మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. హైకోర్టు తన మధ్యంతర ఉత్తర్వుల్లో అన్ని అంశాలూ స్పష్టంగా చెప్పిందని సీజేఐ

-మిగతా 3 లో




## సియోల్‌లో మంత్రుల బృందం పర్యటన

- చెత్త తరలింపు..విద్యుత్ ఉత్పత్తిపై పరిశీలన
- అతిపెద్ద మాపో ప్లాంట్ పనీతిరుపై అధ్యయనం

హైదరాబాద్,
దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో చెత్త నుంచి విద్యుదుత్పత్తి చేసే మాపో రిసోర్స్ రికవరీ ప్లాంట్‌ను మంత్రుల బృందం సందర్శించింది. అలాగే అక్కడ చెత్త ే

-మిగతా 3 లో



## ప్రశాంతంతగా తొలిరోజు గ్రూప్-1 పరీక్షలు

అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపిన సిఎం

హైదరాబాద్,
తెలంగాణలో తొలిరోజు గ్రూప్-1 పరీక్ష ముగిసింది. పరీక్షకు వెళ్లే అభ్యర్థులకు సిఎం రేవంత్ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 29 రద్దు చేయాలని కోరుతూ గ్రూప్-1 అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. పరీక్షను వాయిదా వేసేందుకు నిరాకరించింది. దీంతో షెడ్యూల్ ప్రకారం

-మిగతా 3 లో

# బండి, రేవంత్ ఇద్దరూ దోస్తులే



- గ్రూప్-1 నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్యాయం
- సుప్రీంకోర్టు కేసును తిరస్కరించలేదు
- దీనిపై న్యాయ పోరాటం ఉధృతం చేస్తాం
- విద్యుత్ ఛార్జీలు పెంచితే ఊరుకోం
- మీడియా సమావేశంలో కేటీఆర్ విమర్శలు

హైదరాబాద్,
గ్రూప్-1 నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులకు జరుగుతున్న అన్యాయంపై బీఆర్ఎస్ పార్టీ చివరి వరకు పోరాడుతామని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తేల్చిచెప్పారు. జీవో 29, జీవో 46 తప్పని హైకోర్టులో రుజువు చేయిస్తామని, సమర్థవంతమైన న్యాయవాదితో వాదనలు వినిపిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు.

-మిగతా 3 లో

## మూసీపై పూటకోమాట

- సీఎం రేవంత్‌పై మాజీ మంత్రి హరీష్ ఫైర్
- కుట్రలను బట్టబయలు చేస్తామని హెచ్చరిక




హైదరాబాద్
మూసీ ప్రక్షాళనకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూటకోమాట మాట్లాడుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత తన్నీరు హరీశ్‌రావు ఎద్దేవా చేశారు.

-మిగతా 3 లో

## మనదేశంలో ఓ మాదరిగా.. వారి దేశంలో మరోమాదిరి

- అందుకే దైత్యవేత్తలను కెనడా నుంచి రప్పించాం
- కెనడా తీరుపై అసమనం వ్యక్తం చేసిన మంత్రి జైశంకర్



న్యూఢిల్లీ,
భారత దౌత్యవేత్తలపై కెనడా ప్రభుత్వ చర్యలతో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు క్షీణించిన క్రమంలో..తాజా పరిణామాలపై భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్

-మిగతా 3 లో



## విమానయాన భద్రతలో ప్రభుత్వం రాజీపడదు

- బెదిరింపు కాల్ చేసేవారికి జీవిత ఖైదు
- విమానయాన చట్టాల సవరణకు యత్నిస్తున్నాం
- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి

న్యూఢిల్లీ,
విమానయాన భద్రతే ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యమని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. బెదిరింపులకు పాల్పడేవారిని నో ఫ్లై జాబితాలో చేర్చేలా చట్టాలను సవరిస్తున్నామని పేర్కొన్నారు. ఆయన సోమవారం విలేకర్ల సమావేశంలో

-మిగతా 3 లో

# మద్యం మత్తులో భార్యతో గొడవ

గొంతు కోసం భార్యను హత్యచేసిన దుర్మార్గుడు



విజయవాడ,
మద్యం మత్తులో భార్యను హతమార్చాడో భర్త. ఈ ఘటన విజయవాడ టూ టౌన్ కొత్తపేట పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షేక్ నగీనా అనే మహిళ తన భర్త బాజీతో కలిసి కంసాలిపేటలో నివాసం ఉంటోంది. బాజీ పెయింటర్.. నగీనా ఓ సమోసాల తయారీ కేంద్రంలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. బాజీ మద్యానికి బానిసై రోజూ భార్యతో గొడవపడేవాడు. ఈ క్రమంలో మద్యం మత్తులో ఆమెతో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలోనే కత్తితో నగీనా గొంతు కోసి హతమార్చాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు.. బాజీని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# జివో 29 వల్ల బిసిలకు అన్యాయం

-గవర్నర్‌కు నివేదించిన ఎమ్మెల్సీ మల్లన్న



హైదరాబాద్,
ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ కుమార్ బీసీ సంఘాలతో కలిసి గవర్నర్ ను కలిశారు.జీవో 29పై ఫిర్యాదు చేశారు. ఈ జీవో వల్ల బీసీలకు అన్యాయం జరుగుతుందన్నారు. జీవో 29 ప్రకారం పరీక్షలు నిర్వహించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ పరీక్షలు ముందుకు వెళ్లేవి కాదని స్పష్టం చేశారు. దీనికి ఖచ్చితంగా అడ్డుకట్ట పడుతుందన్నారు. ఇబిసి రిజర్వేషన్లు అక్రమం అని.. గవర్నర్‌కు నివేదించామని మా నాయకడు రాహుల్ గాంధీ కులాలవారీగా జనాభాను బట్టి అవకాశాలు కల్పిస్తామని ఇప్పటికే ప్రకటించారన్నారు. ఖచ్చితంగా బీసీల రిజర్వేషన్లు, బీసీల హక్కులను కాలరాయడానికి ఎవరు ప్రయత్నించినా అది మా పార్టీ అయినా సరే వదిలి పెట్టబోమని ఆయన హెచ్చరించారు.తీన్మార్ మల్లన్న ఇటీవల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. అయితే ఆయన ఎప్పుడూ పార్టీ పాలసీని పట్టించుకోవడం లేదు. తన సొంత అభిప్రాయాల మేరకే రాజకీయం చేస్తున్నారు.తాజాగా జీవో 29 విషయంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అంతా ప్రభుత్వ విధానాన్ని సమర్థిస్తోంది. ఈ జీవో వల్ల ఎవరికీ అన్యాయం జరగదని పైగా.. బడుగు, బలహీన వర్గాలకే మేలు అని వాదిస్తున్నారు. కానీ తీన్మార్ మల్లన్న మాత్రం .. ఈ జీవో వల్ల బీసీలకు అన్యాయం జరుగుతుందని.. ఓ వర్గం వారికి ఉద్యోగాలు కల్పించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నారని ఆరోపిస్తున్నారని ఆరోపిస్తూ సొంత పార్టీ పై బీసీ సంఘాలతో కలిసి గవర్నర్‌కు ఫిర్యాదు చేయడం సంచలనంగా మారింది.

# పోలీస్ రిక్రూట్‌మెంట్‌ను వేగంగా పూర్తి చేయండి



పట్నా,
బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ పాల్గొన్న ఓ కార్యక్రమంలో నాటకీయ సన్నివేశం చోటుచేసుకుంది. రాష్ట్రంలో పోలీస్ రిక్రూట్‌మెంట్‌ను వేగంగా పూర్తి చేయాలంటూ డీజీపీ అలోక్‌రాజ్‌ను సీఎం చేతులు జోడించి అభ్యర్థించడంతో అంతా షాక్ అయ్యారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. కొత్తగా ఎంపికైన 1,239 మంది పోలీస్ అధికారులకు నియామక పత్రాలు అందజేత కార్యక్రమంలో ఈ ఘటన జరిగింది.ఈ సందర్భంగా సీఎం నీతీశ్ ప్రసంగిస్తూ మధ్యలో ఆగి డీజీపీ వైపు చూస్తూ.. 'త్వరగా రిక్రూట్‌మెంట్ జరిగేలా చూస్తారా?' అని చేతులు జోడించి అడిగారు. దీంతో షాకైన డీజీపీ.. ఆయనకు సెల్యూట్ చేశారు. మైక్ వద్దకు వెళ్లి మాట్లాడుతూ.. సీఎం ఆదేశాలు అమలు చేసేందుకు పోలీసులు కట్టుబడి ఉన్నారన్నారు. త్వరితగతిన రిక్రూట్‌మెంట్ పూర్తి చేసి.. పటిష్టమైన శిక్షణ అందిస్తామన్నారు. దీంతో సీఎం ఆయనకు థాంక్స్ చెప్పారు. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ బిహార్‌లో శాంతి భద్రతలపై ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో ఆరోపణలు గుప్పిస్తున్న తరుణంలో సీఎం ఈ విధంగా వ్యాఖ్యానించడం చర్చనీయాంశంగా మారింది.

# రేవంత్ సర్కార్ విధానాలతో పారిశ్రామికరంగం కుదేలు

సామాన్యులపైనా పెను భారాలు : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

డిస్కంల ప్రతిపాదనలను విరమించుకోవాలంటూ ఈఆర్‌సీ చైర్మెన్‌కు విజ్ఞప్తి



హైదరాబాద్
రేవంత్ సర్కారు అవలంభిస్తున్న అర్థరహిత, అనాలోచిత విధానాలతో రాష్ట్రంలో పారిశ్రామికరంగం దెబ్బతింటోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె.తారక రామారావు ఆందోళన వ్యక్తం చేశారు. సామాన్యులపైనా తీవ్ర స్థాయిలో విద్యుత్ భారాలు పడతాయని ఆయన హెచ్చరించారు. విద్యుత్ ఛార్జీల పెంపు ప్రతిపాదనలను తిరస్కరించాలని విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీ)కి ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో ఈఆర్‌సీ చైర్మెన్ తన్నీరు శ్రీరంగారావును కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ%౫% విద్యుత్ ఛార్జీలను పెంచాలంటూ డిస్కంలు 9 ప్రతిపాదనలు చేశాయని గుర్తు చేశారు. గృహాలకు వాడే కరెంటుకు సంబంధించి నెలకు 300 యూనిట్లు దాటితే వసూలు చేసే ఫిక్స్‌డ్ ఛార్జీలను రూ.10 నుంచి ఏకంగా రూ.50కి పెంచాలంటూ ప్రతిపాదించటమనేది అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. ఈ ఒక్కటే మొత్తం రాష్ట్ర ప్రజల ఆర్థిక పరిస్థితిని ఇబ్బందుల్లోకి నెడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తద్వారా సామాన్యులపై విద్యుత్ భారాలు తీవ్రంగా పడతాయని వాపోయారు. పరిశ్రమలన్నింటినీ ఒకే కేటగిరీ కింద ప్రతిపాదించటం సరికాదన్నారు. తద్వారా పలు పరిశ్రమలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిపారు. ఇలాంటి నిర్ణయాలు దేశంలో మరెక్కడా లేవని చెప్పారు. రాష్ట్రంలో పారిశ్రామికరంగ మందగమనంలో ఉన్న ప్రస్తుత తరుణంలో ఇలాంటి ప్రతిపాదనల వల్ల కంపెనీలు ఇతర రాష్ట్రాలకు తరలిపోతాయని హెచ్చరించారు. మోటార్లకు మీటర్లు పెట్టాలన్న కేంద్ర ప్రభుత్వ ఆదేశాలపై కూడా రాష్ట్ర ప్రభుత్వం నోరు మెదపటం లేదన్నారు. ఇలాంటి నిర్ణయాలను వ్యతిరేకిస్తూ బుధవారం ఈఆర్‌సీ నిర్వహించబోయే బహిరంగ విచారణలో పాల్గొంటామని తెలిపారు. మేం లేవనెత్తిన అంశాల్ని సుప్రీం వ్యతిరేకించలేదు%౫ గ్రూప్-1కు సంబంధించి తాము లేవనెత్తిన అంశాలను సుప్రీంకోర్టు వ్యతిరేకించలేదని కేటీఆర్ ఈ సందర్భంగా చెప్పారు. జీవో 29పై తీర్పు వచ్చే వరకు ఫలితాలు విడుదల చేయొద్దంటూ న్యాయస్థానం ఆదేశించిందని గుర్తు చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూసీ రిజర్వేషన్లకు అనుగుణంగా తమ ప్రభుత్వం గతంలో జీవోనెంబరు 55ను తీసుకొచ్చిందని తెలిపారు. తద్వారా మెరిట్ ప్రకారం అందరికీ అవకాశం కల్పించామని అన్నారు. అందుకు భిన్నంగా జీవో 29 అనేది ఓపెన్ కోటాను కూడా రిజర్వ్ చేసేలా ఉందని చెప్పారు. ఇది అన్యాయమైన ఉత్తర్వంటూ గత ఫిబ్రవరి నుంచే తాము చెబుతూ వచ్చామని అన్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వానికి చెవికెక్కలేదని విమర్శించారు. మత ఘర్షణలను ఖండించే స్వేచ్ఛ కూడా ప్రతిపక్షాలకు లేదా? అని కేటీఆర్ ఈ సందర్భంగా ప్రశ్నించారు. ఇందుకు సంబంధించి తనపై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారని వాపోయారు.

# స్టాలిన్ నోట బాబు మాట

పెద్ద కుటుంబాలు ఉండాలన్న తమిళనాడు సీఎం
16 మంది పిల్లలను కనాలని సూచన



చెన్నయ్
'చిన్న కుటుంబం చింతలు లేని కుటుంబం' అనేది నిన్నటి నేతల మాట. మరి ఇప్పుడో? పిల్లాపాపలతో ఇల్లు కళకళలాడుతుండాలని నేటి తరం నాయకులు కొందరు చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెద్ద కుటుంబాల ఆవశ్యకతను నొక్కి చెప్పగా తాజాగా తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కూడా అదే మాట అన్నారు. జనాభా తక్కువగా ఉన్నందున నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలో నష్టపోతామని దక్షిణాది రాష్ట్రాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఇరువురు నేతల మాటలు పునర్విభజన పైన, దక్షిణాది రాష్ట్రాలపై దాని ప్రభావం పైన చర్చకు తెరలేపాయి. అయితే చంద్రబాబు ఉద్దేశం వేరని, రాష్ట్రంలో పెరుగుతున్న వృద్ధుల సంఖ్యను దృష్టిలో పెట్టుకొని ఆయన ఆ వ్యాఖ్య చేశారని టీడీపీ వర్గాలు తెలిపాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో 31 జంటలకు సోమవారం జరిగిన హిందూ వివాహ కార్యక్రమంలో స్టాలిన్ ప్రసంగిస్తూ '16 మంది పిల్లలను కనండి' అంటూ సలహా ఇచ్చారు. వివాహమైన జంటను కుటుంబ పెద్దలు '16 రకాల సంపదను పొంది సౌభాగ్యవంతంగా జీవించాలని' ఆశీర్వదించడం తమిళనాడు సంప్రదాయమని ఆయన గుర్తు చేశారు. 'ఈ ఆశీర్వాదం అర్థం 16 మంది పిల్లలను కనాలని కాదు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి వచ్చింది. చిన్న కుటుంబం కాకుండా 16 మంది సంతానాన్ని కనాలని ప్రజలు భావిస్తున్నారు' అని అన్నారు. ఆ పిల్లలకు అందమైన తమిళ పేర్లు పెట్టాలని సూచిస్తూ రాష్ట్ర గవర్నరుపై స్టాలిన్ పరోక్షంగా విమర్శలు చేశారు.

# ఎయిరిండియా విమానాల్లో ప్రయాణించవద్దు

-ఖలిస్తాన్ ఉగ్రవాది పన్నూ హెచ్చరికలు




న్యూఢిల్లీ,
దేశంలో గత కొన్ని రోజులుగా విమానాలకు వరుసగా బాంబు బెదిరింపులు రావడం ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిణామాల వేళ ఖలిస్థానీ వేర్పాటువాది గుర్‌పత్వంత్ సింగ్ పన్నూ 'ఎయిర్ ఇండియా'కు హెచ్చరికలు చేయడం తీవ్ర కలకలం రేపింది. నవంబరు 1 నుంచి 19వ తేదీల మధ్యలో ఎయిర్ ఇండియా విమానాల్లో ప్రయాణించొద్దని అతడు వార్నింగ్ ఇవ్వడం గమనార్హం. భారత్‌లో సిక్కు వ్యతిరేక అల్లర్లు జరిగి 40 ఏళ్లు కావొస్తున్న సందర్భంగా ఎయిర్ ఇండియా విమానాలపై దాడి జరిగే అవకాశం ఉందని పన్నూ అన్నాడు. అందులో ఆయా తేదీల్లో ఆ సంస్థ విమానాల్లో ప్రయాణించొద్దంటూ ఓ వీడియో సందేశంలో పేర్కొన్నాడు. కాగా.. పన్నూ ఇలాంటి హెచ్చరికలు చేయడం ఇది తొలిసారి కాదు. గత నవంబరులోనూ ఇలాంటి వీడియో విడుదల చేశాడు. నవంబరు 19న దిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ఆ రోజు మూతపడుతుందని, దాని పేరు కూడా మార్చేస్తామని గతేడాది అతడు ఓ వీడియోలో హెచ్చరించాడు. సిఖ్స్ ఫర్ జస్టిస్ అనే వేర్పాటువాద సంస్థను 2007లో స్థాపించగా.. వ్యవస్థాపకుల్లో గురుపత్వంత్ సింగ్ పన్నూ కూడా ఒకడు. ఈ సంస్థను భారత్ 2019లోనే నిషేధించింది. చట్టవ్యతిరేక కార్యకలాపాల చట్టం కింద భారత ప్రభుత్వం అతడిని 2020లో ఉగ్రవాదిగా ప్రకటించింది. ప్రస్తుతం అతడు అమెరికాలో ఉన్నట్లు సమాచారం. పన్నూకు అగ్రరాజ్యంతో పాటు కెనడా పౌరసత్వం కూడా ఉంది.

# తిరుమలలో 31న దీపావళి ఆస్థానం

-ఏర్పాట్లు చేస్తున్న టిటిడి అధికారులు



తిరుమల,
తిరుమల శ్రీవారి ఆలయంలో అక్టోబరు 31 న దీపావళి ఆస్థానం జరగనుంది. ఏలా దదీపావళి ఆస్థానం నిర్వహించడం పరిపాటి. దీపావళి ఆస్థానాన్ని టీటీడీ శాస్త్రోక్తంగా నిర్వహించనుంది. దీపావళి రోజు ఉదయం 7 నుంచి 9 గంటల వరకు బంగారు వాకిలి ముందు గల ఘంటా మండపంలో దీపావళి ఆస్థానం నిర్వహించనుంది. ఆస్థానంలో భాగంగా శ్రీమలయప్పస్వామి దేవేరులతో కలిసి ఘంటా మండపంలో ఏర్పాటు చేసిన సర్వభూపాల వాహనంలో గరుడాళ్వార్‌కు అభిముఖంగా వేంచేపు చేస్తారు. సేనాధిపతి అయిన శ్రీ విష్వక్సేనుల వారిని కూడా స్వామివారి ఎడమ పక్కన మరొక పీఠంపై దక్షిణ ఆభిముఖంగా వేంచేపు చేస్తారు. ఆ తరువాత స్వామివారికి ప్రత్యేక పూజ, హారతి, ప్రసాద నివేదనలను అర్చకులు ఆగమోక్తంగా నిర్వహిస్తారు. దీంతో దీపావళి ఆస్థానం పూర్తవుతుంది.
ఇక, దీపావళి రోజున సాయంత్రం 5 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి వారు సహస్ర దీపాలంకరణ సేవలో పాల్గొని, ఆలయ నాలుగు మాడ వీధులలో విహరించి భక్తులను కటాక్షించనున్నారు. దీపావళి ఆస్థానం కారణంగా టిటిడి ఆర్జిత సేవలను రద్దు చేసింది. అక్టోబరు 31న తిరుప్పావడ, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం సేవలను టీటీడీ రద్దు చేసింది. తోమాల, అర్చన సేవలను అర్చకులు ఏకాంతంగా నిర్వహిస్తారు.

# పోలీస్ కుటుంబాలను ఆదుకుంటాం

(మొదటి తరువాయి)

ఆదుకుంటుందని చెప్పారు. విధి నిర్వహణలో మరణించిన అధికారులను గుర్తు చేసుకోవడం అందరికీ స్ఫూర్తిదాయకమని చెప్పారు. అమరులైన కానిస్టేబుల్, ఏఎస్సై కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్‌లోని గోషామహల్ స్టేడియంలో నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. విధి నిర్వహణలో అసువులుబాసి అమరులైన పోలీసులకు సీఎం నివాళు లర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ ప్రసంగిస్తూ.. అమరులైన పోలీస్ అధికారులందరికీ ప్రభుత్వం తరపున ఘన నివాళులర్పించారు. 140 కోట్ల దేశ జనాభా ప్రశాంతంగా ఉంటున్నారంటే అందుకు పోలీసులే కారణమన్నారు. రాష్ట్రం అభివృద్ధి పదంవైపు నడవాలంటే పోలీసులు కీలకమన్నారు. నిరుద్యోగుల సమస్య, శాంతి భద్రత లేని రాష్ట్రం ఉంటే పెట్టుబడులు రావని.. రాష్ట్రం అభివృద్ధికి పోలీసులు నిరంతరం శ్రమిస్తున్నందుకు అభినందనలు తెలియజేశారు. అమరులైన పోలీస్ అధికారుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని స్పష్టం చేశారు. అమరులైన ఎస్సై, సీఐ కుటుంబాలకు రూ.కోటి 25 లక్షలు.. డీఎస్పీ, ఏఎస్పీ కుటుంబాలకు రూ.కోటి 50 లక్షలు.. ఎస్పీ, ఐపీఎస్ కుటుంబాలకు రూ.2 కోట్ల పరిహారం ఇస్తామన్నారు. శాశ్వత అంగవైకల్యం పొందిన పోలీసులకు పరిహారం ఇస్తామని ప్రకటించారు.'పోలీసు సిబ్బంది పట్ల నాకు ప్రత్యేక అభిమానం ఉంది. పోలీసులు, వారి కుటుంబాలు ఆత్మగౌరవంతో జీవించాలి. ఎవరి ముందో చేయి చాచే పరిస్థితి తెచ్చుకోవద్దని కోరుతున్నానని అన్నారు. విమర్శలకు అవకాశం ఇవ్వొద్దని కోరుతున్నా. విధి నిర్వహణలో పోలీసులకు ఎలాంటి లోటు లేకుండా చర్యలు తీసుకుంటాం. వారి ఖర్చులు, ఇతర ఏర్పాట్లకు నిధులు కేటాయిస్తాం. నేరగాళ్లు సరికొత్త విధానాలతో ముందుకొస్తున్నారు. పెరుగుతున్న ఆధునిక సాంకేతికత ద్వారా నేరాలు చేస్తున్నారని హెచ్చరించారు. తెలంగాణ పోలీసుల విధానాలను ఇతర రాష్ట్రాలు పాటిస్తున్నాయి. మన ఫోరెన్సిక్ ల్యాబ్ అనేక రాష్ట్రలకు ఆదర్శంగా నిలుస్తోంది. మన సైబర్ క్రైమ్ విభాగం దేశంలోనే గొప్పదని కేంద్ర హోంశాఖ అభినందించింది. ఇవాళ డ్రగ్స్ మహమ్మారి యువతను పట్టిపీడిస్తోంది. డ్రగ్స్ వల్ల పంజాబ్ అనేక కష్టాలు ఎదుర్కొంటోంది. మాదకద్రవ్యాల వినియోగం రాష్ట్రంలో క్రమంగా పెరుగుతోంది. వీటి నివారణకు రాష్ట్రంలో టీజీన్యాబ్‌ను ఏర్పాటు చేశాం. ఏఐ పరిజ్ఞానంతో ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించేవారిని గుర్తిస్తున్నాం. నేరస్థులను కఠినంగా శిక్షించేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. శాంతిభద్రతలను చేతుల్లోకి తీసుకోవద్దని ప్రజలను కోరుతున్నాం. వివిధ పండుగలు ప్రశాంతంగా జరుపుకోవడంలో పోలీసుల సేవలు మరచిపోలేము. జీతం కోసం వారు పనిచేయడం లేదని అన్నారు. బాధ్యతాయుతంగా భావించి సేవలు అందిస్తున్నారు' అని రేవంత్‌రెడ్డి తెలిపారు. తీవ్రవాదులు, మావోయిస్టు చేతుల్లో మరణించిన అధికారులను స్మరించుకోవడం అందరికి స్ఫూర్తిదాయకమన్నారు. సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని.. డ్రగ్స్ మహమ్మారి యువతపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. దేశానికే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నామన్నారు. మందిరాల మీద, మజీద్‌ల మీద దాడులు చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఇటీవల ముత్యాలమ్మ గుడిపై దాడి చేసిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. శాంతి భద్రతలు తమ చేతిల్లోకి తీసుకునే వారి పట్ల కఠినంగా ఉండాలని తెలిపారు. వివిధ పండుగలు ప్రశాంతంగా జరుకోవడంలో పోలీస్ సేవలు మరచిపోలేమని కొనియాడారు. జీతం కోసం పోలీస్ సిబ్బంది పనిచేయడం లేదని.. బాధ్యతాయుతంగా భావించి పోలీసులు సేవలు అందిస్తున్నారన్నారు. క్రిమినల్స్‌తో పోలీసులు ఫ్రెండ్లీగా ఉండడం కాదని.. బాధితులతో ఫ్రెండ్లీగా ఉండాలని సూచించారు.

# బండి, రేవంత్ ఇద్దరూ దోస్తులే

(మొదటి తరువాయి)

తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. గ్రూప్–1 అభ్యర్థుల తరపున తమ పార్టీ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, దాసోజు శ్రవణ్.. పది మంది గ్రూప్–1 అభ్యర్థులతో కలిసి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తమ పిటిషన్ తరపున కపిల్ సిబల్ బలమైన వాదనలు వినిపించారు. పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించలేదు. ఇవాళ పరీక్ష ఉంది కాబట్టి.. ఈ సమయంలో ఆపడం కరెక్ట్ కాదు. గ్రూప్–1 అభ్యర్థులు దాఖలు చేసిన రిట్ పిటిషన్ మీద హైకోర్టు నిర్ణయం తీసుకునే వరకు ఫలితాలను ప్రకటించొద్దని ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. త్వరగా విచారణ జరిపి న్యాయం చేయాలని కూడా సుప్రీంకోర్టు చెప్పిందని కేటీఆర్ తెలిపారు. కసీఆర్ నాయకత్వంలో జీవో 55 తీసుకొచ్చాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులకు న్యాయం జరగాలని జీవో 55 తెచ్చాం. ఓపెన్ కోటాలో కూడా రిజర్వ్‌డ్ వారికి అవకాశం కల్పించే విధంగా జీవో 55 తీసుకొచ్చాం. జీవో 29పై తాము జూన్, జులై నుంచి మొత్తుకుంటున్నాం. శాసనసభలో హరీశ్‌రావు మాట్లాడారు. ప్రెస్‌మీట్ పెట్టి ఆర్ఎస్పీ, దాసోజు శ్రవణ్ పలుమార్లు హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూర్ఖపు వైఖరి వల్ల గందరగోళాల మధ్య పరీక్ష నిర్వహించారని కేటీఆర్ ధ్వజమెత్తారు. 63 పోస్టులకు 30 వేల మంది పోటీ పడుతున్నారు. వారం రోజుల పాటు పరీక్షలు రాయాలి. మనసులో ఎంతో ప్రశాంతత ఉండాలి. కానీ ఈ ప్రభుత్వం వారిని హింసించింది. కోర్టులో కేసు ఉంది.. తెగేదాకా ఆగండి అంటే కూడా కనికరించలేదు. జీవో 29 రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు. కానీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. తెలుగు అకాడమీ పుస్తకాలు ప్రామాణికం కాదంటే మేం ఎక్కడ చావాలి అని అడిగారు. పరీక్షలు ఎలా రాయాలని అడిగారు. కొంచెం వాయిదా వేయండని అడిగారు. ధర్నాలు, దరఖాస్తులు పెట్టుకున్నారు. కానీ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోంది. బలహీన వర్గాలను అణిచివేస్తోంది. జీవో 55కి తూట్లు పొడిచింది. తెలంగాణేతర పిల్లలకు ప్రయోజనం చేకూర్చేలా వ్యవహరిస్తోంది. హైకోర్టులో కూడా గ్రూప్–1 అభ్యర్థుల తరపున కొట్లాడుతాం. టాప్ లాయర్‌ను తీసుకొస్తామని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చిందే నిరుద్యోగులు. ఇప్పుడేమో వారిని జీవో 29 తీసుకొచ్చి మోసం చేస్తున్నారు. జీవో 46కు సంబంధించిన పిల్లల కోసం కూడా సుప్రీంకోర్టులో కొట్లాడుతాం. గ్రూప్–4లో బ్యాక్ లాగ్ పోస్టులు కానివ్వొద్దని కోరుతున్నారు. ఇకపోతే సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్రమంత్రి బండి సంజయ్‌లు రహస్య మిత్రులని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు సంచలన ఆరోపణలు చేశారు. రేవంత్ కుర్చీ పోతుంటే బండి సంజయ్‌కు అంత బాధ ఎందుకని ప్రశ్నించారు. బండి సంజయ్ కామెంట్లపై స్పందించాల్సిన అవసరం లేదని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ నేతలవి రహస్య ఒప్పందాలని.. ఖచ్చితంగా బయటకు వస్తాయని కేటీఆర్ అన్నారు.

# మూసీపై పూటకోమాట

(మొదటి తరువాయి)

ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మూసీ పరివాహక అభివృద్ధి కోసం ఐదేండ్లలో రూ.లక్షన్నర కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేసినట్టు జులై 20న సీఎం ప్రకటించారని గుర్తు చేశారు. అదే సీఎం సెప్టెంబరు ఆరున విడుదల చేసిన 'తెలంగాణ గ్రోత్ స్టోరీ ద రోడ్ టు వన్ ట్రిలియన్ డాలర్ ఎకానమీ' విజన్ డాక్యుమెంట్‌లో 18 బిలియన్ డాలర్ల (లక్షన్నర కోట్లు)తో మూసీ రివర్ ఫ్రంట్‌ను రీడెవలప్‌మెంట్ చేయబోతున్నామంటూ ప్రకటించారని తెలిపారు. ఇటీవల నిర్వహించిన విలేకర్ల సమావేశంలో అదే రేవంత్ 'లక్షన్నర కోట్లు' అని ఎవరన్నారంటూ ఆవేశంతో ఊగిపోయారని విమర్శించారు. ఈ రకంగా పూటకో తీరుగా మాట్లాడుతున్న ముఖ్యమంత్రిని చూసి ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతుందని ఎద్దేవా విమర్శించారు

## విమానయాన భద్రతలో ప్రభుత్వం రాజీపడదు

(మొదటి తరువాయి)

మాట్లాడుతూ ఇప్పటి వరకు వచ్చిన బెదిరింపులు మొత్తం బూటకమని తేలిందన్నారు. పౌర విమానయాన శాఖకు కఠినమైన ప్రొటోకాల్ ఉందని.. దానినే తమ శాఖ, విమానయాన సంస్థలు అనుసరిస్తోందని వివరించారు. ఇలాంటి బెదిరింపులు వచ్చిన సమయంలో పరిస్థితి చాలా సున్నితంగా ఉంటుందన్నారు. అంతర్జాతీయ విధివిధానాలను మనం అనుసరించాలని ఆయన వ్యాఖ్యానించారు. బెదిరింపు కాల్స్, సోషల్ మీడియా పోస్టులకు పాల్పడేవారికి జీవిత ఖైదు విధించేలా చట్టపరమైన మార్పులు తెచ్చేందుకు యత్నిస్తున్నామన్నారు. విమానంలో బోర్డింగ్ అయ్యాక బెదిరింపులకు పాల్పడేవారికి ఇటువంటి శిక్ష విధించేలా ఇప్పటికే చట్టంలో సెక్షన్లు ఉన్నాయి. కానీ, ఇతర ప్రాంతాల్లో ఉంటూ బెదిరింపులకు పాల్పడేవారికి కూడా వీటిని వర్తింపజేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనిలో ఉగ్రకోణంపై స్పందించేందుకు కేంద్ర మంత్రి నిరాకరించారు. అక్టోబర్ 14 నుంచి పలు విమానాలకు దాదాపు 100 బెదిరింపులు వచ్చాయి. ఈ అంశంపై పలు వర్గాలతో సమావేశాలు నిర్వహించినట్లు రామ్మోహన్ నాయుడు తెలిపారు. విమానయాన భద్రతా నిబంధనల సవరణ అంశాన్ని కూడా పరిశీలిస్తున్నామని చెప్పారు. 1982 సేఫ్టీ ఆఫ్ సివిల్ ఏవియేషన్ చట్టాన్ని సవరించే అంశంపై వివిధ శాఖలతో కూడా చర్చిస్తున్నట్లు వివరించారు. 'గత వారం పలు విమానాలకు బెదిరింపులు రావడంతో వేరే మార్గాలకు మళ్లించాము. ప్రతి దానిని ప్రత్యేకంగా విశ్లేషించి వేగంగా, సమర్థవంతంగా చర్యలు తీసుకొన్నాం. అవి తప్పుడు బెదిరింపులైనా.. భద్రత, సురక్షిత విషయంలో రాజీ పడటంలేదు. ప్రయాణికుల ప్రాణాలే మాకు ముఖ్యం. అదే సమయంలో ఒక్క విమానాన్నైనా దారి మళ్లించాలనో, జాప్యం చేయాలనో మేము అనుకోవడం లేదు. హోంశాఖ, ఇతర ఏజెన్సీలతో కలిసి వీటిపై దర్యాప్తును వేగవంతం చేస్తున్నాం. రానున్న రోజుల్లో మెరుగైన పరిస్థితిని చూస్తాం' అని కేంద్ర మంత్రి చెప్పారు.

# గ్రూప్–I పరీక్షల్లో జోక్యం చేసుకోలేం

(మొదటి తరువాయి)

నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది. అభ్యర్థులు పరీక్షా కేంద్రాల్లో ఉన్నప్పుడు జోక్యం చేసుకోవడం సరికాదని పేర్కొంది. ఫలితాల విడుదలకు ముందే తుది విచారణ ముగించాలని హైకోర్టుకు సూచించింది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 29 రద్దు చేయాలని కోరుతూ గ్రూప్–1 అభ్యర్థులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తీర్పు వచ్చే వరకు పరీక్షలు వాయిదా వేయాలని కోరారు. జీవో 55నే అమలు చేయాలని కోరినా సీఎం పట్టించుకోవడం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. దివ్యాంగుల రిజర్వేషన్లకు సంబంధించి 2022లో జారీ చేసిన జీవో 55కు సవరణ తీసుకొస్తూ ఫిబ్రవరి 8న జారీ చేసిన జీవో 29ని రద్దు చేయాలని గ్రూప్–1 అభ్యర్థులు కోరుతున్నారు. జనరల్ కేటగిరీలోని అభ్యర్థుల కంటే ఎక్కువ మార్కులు సాధించిన వారిని అన్‌రిజర్వుడుగానే పరిగణిస్తుండటం వల్ల దివ్యాంగ అభ్యర్థులకు అన్యాయం జరుగుతోందన్నారు. వారికంటే ఎక్కువ మార్కులు వచ్చినా.. రిజర్వేషన్ కేటగిరీగానే పరిగణించి 1:50 కింద అభ్యర్థులను మెయిన్స్‌కు పిలవాలని కోరుతున్నారు. దివ్యాంగుల రిజర్వేషన్లకు సంబంధించిన వివాదం నేపథ్యంలో గ్రూప్–1 పరీక్షలు నిలిపివేయాలని కొందరు అభ్యర్థులు కోరగా.. హైకోర్టు నిరాకరించింది. నోటిఫికేషన్ రద్దు చేయాలన్న అభ్యర్థనను తిరస్కరించిన ఉన్నత న్యాయస్థానం.. నియామకాలు తుది తీర్పునకు లోబడి ఉంటాయని విచారణ వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో గ్రూప్–1 అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో సోమవారం నుంచి జరగాల్సిన గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలకు లైన్ క్లియర్ అయింది. మరికొద్ది గంటల్లో పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ప్రస్తుత దశలో పరీక్షల నిర్వహణలో తాము జోక్యం చేసుకోలేమని తెలిపింది. మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు న్యాయస్థానం నిరాకరించింది. ఈనెల 27వ తేదీ వరకు గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని టీజీపీఎస్సీ షెడ్యూల్ విడుదల చేసింది. పరీక్షల వాయిదాకు నిరాకరిస్తూ పిటిషన్‌ను తిరస్కరించడంతో దీంతో తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. తెలంగాణలో గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షల కోసం టీజీపీఎస్సీ పూర్తి ఏర్పాట్లు చేసింది. అక్టోబర్ 21 నుంచి 27వ తేదీ వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలకు 31,383 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో 46 పరీక్షా కేంద్రాల ఏర్పాటు చేశారు. హైదరాబాద్ జిల్లాలో 8, రంగారెడ్డి జిల్లాలో 11, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 27 పరీక్ష కేంద్రాలను టీజీపీఎస్సీ ఏర్పాటుచేసింది. అన్ని కేంద్రాల వద్ద ఏవిధమైన అవకతవకలు, అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పోలీసు శాఖ తెలిపింది. పరీక్షల నిర్వహణను జిల్లా కలెక్టర్లు పర్యవేక్షిస్తారు. 2011 తర్వాత గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలు జరుగుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారి ఈ పరీక్షలను నిర్వహిస్తున్నారు. గతంలో నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ అనివార్య కారణాలతో వాయిదాపడుతూ వచ్చింది.

# ప్రపంచానికి ఆశాకిరణంగా భారత్

(మొదటి తరువాయి)

ప్రపంచానికి భారత్ ఆశాకిరణంలా కనిపిస్తోందన్నారు. దేశం ప్రతి రంగంలో శరవేగంగా అభివృద్ధి చెందుతోందని అభివర్ణించారు. 'మా ప్రభుత్వం ఇప్పటికే 125 రోజులు పూర్తి చేసుకొంది. ఈ కాలంలో మా ప్రభుత్వ అనుభవాన్ని మీతో పంచుకుంటాను. పేదలకు 3 కోట్ల కొత్త పక్కా గృహాలు ఇచ్చాం. రూ.9 లక్షల కోట్ల ఇన్ఫ్రా ప్రాజెక్టులపై పని మొదలైంది. 15 వందేభారత్ రైళ్లు ప్రారంభించాం. 8 కొత్త ఎయిర్ పోర్టుల పనికి శ్రీకారం చుట్టాం. యువతకు రూ.2లక్షల కోట్ల రూపాయల ప్యాకేజీ ఇచ్చాం. రైతుల ఖాతాల్లో రూ.21 వేల కోట్లను బదిలీ చేశాం. 70 ఏళ్లు దాటిన వృద్ధులకు ఉచిత వైద్యానికి ఏర్పాట్లు చేశాం. 5 లక్షల ఇళ్లలో రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలు ఏర్పాటు చేశాం. స్టాక్‌మార్కెట్ సూచీల్లో దాదాపు 7 శాతం వృద్ధి నమోదైంది. విదేశీ మారకద్రవ్యం 700 బిలియన్ డాలర్లను దాటేసింది. నేను కేవలం 125 రోజుల్లో జరిగిందే చెబుతున్నాను. ఈ కాలంలో భారత్‌లో ప్రపంచం మూడు విషయాలు చర్చించడానికి వచ్చింది. టెలికామ్–డిజిటల్ ఫ్యూచర్‌పై అంతర్జాతీయ అసెంబ్లీ జరిగింది. గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్టివల్ నిర్వహించారు. గ్లోబల్ సెమీకండెక్టర్ ఎకోసిస్టమ్‌పై సదస్సు జరిగింది. ఇవి భారత్ దిశ.. ప్రపంచం ఆశను తెలియజేస్తున్నాయి. ప్రపంచ భవిష్యత్తును భారత్ నిర్ణయిస్తుంది. మా ప్రభుత్వ మూడో విడత పాలనతో రేటింగ్ ఏజెన్సీలు దేశ వృద్ధిరేటును గణనీయంగా పెంచాయి' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భారత్ వేగంగా వృద్ధి చెందుతున్న దేశమని ప్రధాని మోదీ అభివర్ణించారు. పేదల కష్టాలు తమకు బాగా తెలుసన్నారు. ఈ కార్యక్రమానికి ముందు ఆయన సదస్సులో పాల్గొనడానికి వచ్చిన విదేశీ అతిథులను కలుసుకొన్నారు. రెండ్రోజుల పాటు జరగనున్న ఈ సదస్సులో యూకే మాజీ ప్రధాని డేవిడ్ కామరూన్, భూటాన్ ప్రధాని దాసో త్సేరింగ్ టోబ్గే, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, భారతీ ఎయిర్‌టెల్ ఛైర్మన్ సునీల్ మిత్తల్ తదితరులు పాల్గొననున్నారు.

# సియోల్‌లో మంత్రుల బృందం పర్యటన

(మొదటి తరువాయి)

నకరణ, మురికి నీటి నిర్వహణ తదితర పద్ధతులను కూడా పరిశీలించింది. సియోల్‌లో తెలంగాణ మంత్రులు, అధికారుల బృందం పర్యటిస్తోంది. మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, పలువురు ఎమ్మెల్యేలు, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్, జీహెచ్ఎంసీ, మూసీ రివర్‌ఫ్రంట్ అధికారులు ఈ బృందంలో ఉన్నారు. మాపో ప్లాంట్‌లో రోజుకు వెయ్యి టన్నుల వ్యర్థాలను రీసైక్లింగ్ చేసి విద్యుదుత్పత్తి చేస్తున్నారు. వ్యర్థాల రీసైక్లింగ్‌కు వేస్ట్ టు ఎనర్జీ టెక్నాలజీని సియోల్ నగరపాలక సంస్థ వాడుతోంది. పర్యావరణంపై దుష్ప్రభావం పడకుండా ఆధునిక సాంకేతికతను వినియోగిస్తోంది. మరో 10 ఏళ్లలో పూర్తిగా భూ ఉపరితలం నుంచి తొలగించి భూగర్భంలో అతిపెద్ద ప్లాంట్‌ను నిర్మించేందుకు సియోల్ నగర పాలక సంస్థ ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో మాపో ప్లాంట్ పనితీరును అధ్యయనం చేసేందుకు తెలంగాణ మంత్రుల బృందం వెళ్లింది. హైదరాబాద్ నగరం, తెలంగాణ ప్రజల భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మూసీ నదిని ప్రక్షాళన చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సియోల్‌లో చెయోంగ్ గయ్ చియోన్ నదిని ఆయన పరిశీలించారు.

# ప్రశాంతంతగా తొలిరోజు గ్రూప్-1 పరీక్షలు

(మొదటి తరువాయి)

సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు మెయిన్స్ పరీక్షలు మొదలయ్యాయి. ఈ నెల 27 వరకు ఈ పరీక్షలు కొనసాగనున్నాయి. పలు చోట్ల పరీక్షకు ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను పోలీసులు కేంద్రాల్లోకి అనుమతించలేదు. పలుచోట్ల అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో వారిని సిబ్బంది పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించలేదు. ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా గేట్లు తాళం వేయడంతో అక్కడే ఉన్న సిబ్బందిని అభ్యర్థులు చాలాసేపు వేడుకున్నారు. గేటు పట్టుకుని రోదిస్తూ దయచేసి పంపించాలని వేడుకున్నారు. కానీ నిబంధనల ప్రకారం అనుమతించేది లేదని సిబ్బంది చెప్పారు. దీంతో చాలామంది వెనుతిరిగారు. సికింద్రాబాద్‌లోని పరీక్షా కేంద్రానికి ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చిన మాథ్యూస్ అనే అభ్యర్థిని పోలీసులు అనుమతించలేదు. దీంతో గోడ దూకి పరీక్ష కేంద్రం వైపు పరుగులుపెట్టాడు. ఇది గమనించిన పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని బేగంపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దుండిగల్‌లో ఓ అభ్యర్థిని పొరపాటున తన పరీక్షా కేంద్రానికి కాకుండా వేరే పరీక్షా కేంద్రానికి వెళ్లింది. అక్కడే విధులు నిర్వహిస్తున్న ఓ పోలీసు సిబ్బంది విషయం తెలుసుకుని ఆమెకు సాయం చేశాడు. వెంటనే ఆమెను తన బైక్‌పై ఎక్కించుకుని సకాలంలో సరైన పరీక్షా కేంద్రం వద్ద దింపాడు. గ్రూప్–1 మెయిన్స్ పరీక్షకు సంబంధించిన పిటిషన్లు సుప్రీంకోర్టులో విచారణకు ఉండటంతో పరీక్ష వాయిదా పడుతుందేమోనని అనుకున్నారు.నవంబర్ 20లోగా విచారణ పూర్తి చేయాలని హైకోర్టును సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇప్పటికే అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్న నేపథ్యంలో.. ఈ దశలో పరీక్షల వాయిదాపై జోక్యం చేసుకోలేమని సుప్రీంకోర్టు పేర్కొంది. దీంతో షెడ్యూల్ ప్రకారం గ్రూప్–1 పరీక్షలు మొదలయ్యాయి. పరీక్ష వాయిదా వేయాలని ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలో ఎగ్జామ్ సెంటర్ల వద్ద పోలీసులు పటిష్ఠ భద్రత ఏర్పాటు చేశారు. అన్ని కేంద్రాల వద్ద బీఎన్ఎస్ఎస్ 163 సెక్షన్ విధించారు. ఎగ్జామ్ హాల్, చీఫ్ సూపరింటెండెంట్, పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిస్థితిని గమనించారు. ఇదిలావుంటే పరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థులకు సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఎక్స్‌లో ఆయన పోస్ట్ చేశారు. 'గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థులకు నా శుభాకాంక్షలు. ఎటువంటి ఆందోళన చెందకుండా పూర్తి ఏకాగ్రతతో పరీక్షలు రాయండి. ఈ పరీక్షల్లో మీరు విజయం సాధించి తెలంగాణ పునర్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని సీఎం పేర్కొన్నారు.

# మనదేశంలో ఓ మాదరిగా..
## వారి దేశంలో మరోమాదిరి

(మొదటి తరువాయి)

స్పందించారు. పోలీసు విచారణలో భారత హైకమిషనర్ పాల్గొనాలని కెనడా కోరిందని.. అందుకే మన హైకమిషనర్‌తో పాటు దౌత్యవేత్తలను వెనక్కి పిలిపించామని చెప్పారు. ఓ జాతీయ వార్తా ఛానెల్ నిర్వహించిన సదస్సులో పాల్గొన్న ఆయన.. ఆ దేశంతో సంబంధాలను ప్రస్తుతం అంచనా వేయడం కష్టమేనన్నారు. 'పోలీసు విచారణలో భారత హైకమిషనర్ పాల్గొనాలని కెనడా కోరింది. అందుకే మన హైకమిషనర్‌తోపాటు దౌత్యవేత్తలను ఉపసంహరించుకోవడాన్ని ఎంచుకున్నాం. దౌత్యవేత్తల సంక్షేమం, భద్రతకు సంబంధించి కెనడాలో ఏం జరుగుతుందనే విషయాలను తెలుసుకోవడం కెనడాకు ఇబ్బంది కరంగా మారినట్లు కనిపిస్తోంది. అదే భారత్‌లో.. కెనడా దౌత్యవేత్తలు మాత్రం మన సైన్యం, పోలీసుల సమాచారాన్ని స్వేచ్ఛగా సేకరించడం, నిర్దేశిత పౌరులను కెనడాలో అడ్డుకునేందుకు మాత్రం ఎటువంటి చర్యలుండవు ' అని కెనడా తీరుపై జైశంకర్ మండిపడ్డారు.

## సంపాదకీయం

# రాజకీయ పబ్బం కోసం విమర్శలు !

తెలంగాణ, ఆంధ్రాలో విపక్షంలో ఉన్న బిఆర్ఎస్, వైకాపాలు తమది ..ఒక్కటే రాగం అన్న చందంగా విమర్శలతో కాలం గడుపుతున్నారు. అప్పుడే కొంపలు అంటుకు పోయాయని, తాము ఉంటే అంటుకునేవి కావన్న రీతిలో గగ్గోలు పెడుతున్నారు. విమర్శలకు హద్దులు ఉండవన్న రీతిలో రెండు పార్టీల నేతలు రోజూ ఏదో ఒక అంశం తీసుకుని పదేపదే విమర్శలు చేస్తున్నారు. ఎంతగా అంటే ఒకరోజు మీడియాతో మాట్లాడడం, మరుసటి రోజు దానినే ట్విట్టర్ ద్వారా వల్లించడం, తరవాతి రోజు దానిపై సొంత పత్రికల్లో కథనాలు రాయించడం అలవాటు చేసుకున్నారు. నవ్విపోదురు గాక నాకేంటన్న చందంగా ..గత పాపాలను ప్రజలు మరచి పోవాలన్న ఏకైక లక్ష్యంతో జంకూగొంకూ లేకుండా విమర్శలతో కాలం గడిపేస్తున్నారు. ఎపిలో జగన్, తెలంగాణలో కెటిఆర్, హరీష్ రావులు ఈ అబద్దాల ప్రచారంలో ఆరితేరారు. అధికారంలో ఉన్నప్పుడు వివిధ మార్గాల్లో సొంత ఆదాయం పెంచుకున్న వీరు ఇప్పుడు ప్రభుత్వంలో ఉన్న చంద్రబాబు ను, రేవంత్‌ను అడ్డగోలుగా దోచుకుంటున్నారని గగ్గోలు పెడుతున్నారు. అధికారమంటే దోచుకోవడమే అన్న చందంగా ఐదేళ్లు జగన్, పదేళ్లు బిఆర్ఎస్ నేతలు దోచుకున్నది ప్రజలు మరచి పోలేదు. ప్రభుత్వ వనరులను,ఖజానాను కొల్లగొట్టి తమ సొంత వనరులు సమకూర్చుకున్న నేతలుగా చరిత్రలో వీరు నిలిచి పోయారు. అసలు ఎపి విభజన జరిగిందే వీరి ఆదాయాలు పెంచడానికి అన్న చందంగా రాష్ట్రాల తీరు మారింది. అప్పులతో కుదేలు చేశారు. జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితికి తీసుకుని వచ్చారు. ఎపిలో లిక్కర్ పాలసీతో నాసిరకం మద్యం సరఫరా చేసిన జగన్ అడ్డంగా దోచుకున్నారు. నీతి, నిజాయితీ, విలువలు, విశ్వసనీయత వంటి మాటలు వల్లెవేస్తూ..గతమంతా బంగారు మయం చేశామని ఈ నేతలు చెప్పుకోవడం సిగ్గుచేటు. రాష్ట్ర ప్రయోజనాలను గాలికి వదిలేసిన వైకాపా, బిఆర్ఎస్ నేతలు ఇప్పుడు ప్రజలపై వల్లమాలిన ప్రేమను ఒలకబోస్తున్నారు. జర్నలిస్టులంటే అయ్యో అంటూ రాగాలు తీస్తున్నారు. ప్రజలను ఛీదరించుకునే స్థాయికి దిగజార్చి, వారిని కనీసం దరిచేరకుండా పాలన చేసి, సిఎం కలవాల్సిన అవసర మేముందని దబాయింపు మటలు మాట్లాడిని నేతలు ఇప్పుడు ప్రజలపై ఎక్కడ లేని ప్రేమను ఒలక బోస్తున్నారు. మల్లన్నసాగర్‌లో ప్రజల జీవితాను ముంచేసిన కెసిఆర్ బృందం ఇప్పుడు మూసీ మురికి బాధితుల కోసం మొసలి కన్నీరు కారుస్తున్నారు. దోచుకోవడమే పాలన అన్నచందంగా సాగిన వీరి ఆగడాలను భరించలేకే ప్రజలు అధికారం నుంచి దించేశారు. సంక్షేమం పేరిట ప్రజలకు డబ్బు పందేరాలు సాగించి, అదే అభివృద్ధి అని నమ్మించి ఎన్నికల్లో ఓటమి పాలైనా వీరికి జ్ఞానోదయం కలగడం లేదు. ఆనాడు దూరం పెట్టిన ప్రజలపై ఇప్పుడు ఎక్కడలేని మమకారం పుట్టుకొస్తోంది. ఓటమి ఎందుకు ఎదురైందో తెలుసుకునే ప్రయత్నం చేయకపోవడం ఆత్మవంచన చేసుకోవడం తప్ప మరోటి కాదు. ప్రతిపక్షంలో కూర్చోవడానికి కూడా సిద్ధంగా లేని నేతలు.. ముఖ్యమంత్రిగా మాత్రమే ఉండాలనుకుంటున్న నేతలను ప్రజలు సమయం చూసి వాతలు పెట్టారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష నేత చంద్రబాబు హైదరాబాద్‌లో నివసించడమేమిటని ప్రశ్నించిన జగన్ ఇప్పుడు తాను బెంగళూరులోని ప్యాలెస్‌లో ఎందుకు సేదదీరుతున్నారో చెప్పాలి. అలాగే అసెంబ్లీకి రాని, ప్రజల సమస్యలను పట్టించుకోని ఫామ్‌హౌజ్ కే పరిమితమైన కెసిఆర్ విపక్షనేతగా ఉండాలా అన్నది కూడా ప్రజలు ఆలోచించాలి. ఇలాంటి వారిలో పరివర్తన వస్తుందని, రావాలనుకోవడం అమాయకత్వమే అవుతుంది. అధికారంలో ఉన్నప్పుడు చెయ్యాల్సిన దురాగతాలన్నీ చేసి ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి, పత్రికా స్వేచ్ఛ గురించి, పోలీసుల వేధింపుల గురించి మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉంది. ఇది చాలదన్నట్లు ఇప్పటి కిప్పుడు ఎన్నికలు జరిగితే తమదే అధికారం అని బిఆర్ఎస్ తమ బాకా పత్రికలో కథనాలు రాయించు కుంటోంది. తెలంగాణలోమూసీ మురికి వదలకూడదు. అక్రమంగా రైతుబంధును అమలు చేసిన తీరును అడ్డుకోరాదు. అక్రమంగా బతుకమ్మ చీరల పేరుతో జరిగిన అన్యాయాలను నిలదీయరాదు. నిరుద్యోగులకు టోపీ పెట్టిన వైనాన్ని నిలదీయరాదు. మిష్ భగీరథ, మిషన్ కాకతీయ, కాళేశ్వరం, ధరణి అవినీతుల గురించి మాట్లారాదు. నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన జరగాలని ఆకాక్షించి గ్రూప్ పరీక్షలు నిర్వహిస్తే వాటిని అడ్డుకోవడం అలవాటు చేసుకున్నారు. రెచ్చగొట్టి పబ్బం గడుపుకునే ముఠాలు తయారయ్యాయి. ఇదంతా చూస్తున్న తెలుగు ప్రజలు మాత్రం ఈ రెండు పార్టీలకు తగిన శాస్తి జరిగిందని సరిపెట్టుకుంటున్నారు. ప్రజలను కలవాల్సిన అవసరం సిఎంకు ఏమిటన్న కెటిఆర్ నిజాలు గ్రహించడం లేదు.హరీష్‌రావు కూడా ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారు. దుష్ట సంప్రదాయాలకు తలపడితే దాని పర్యవసానాలు ఇలాగే ఉంటాయి. మీడియాపై అక్కసు వెళ్లగక్కిన ఇరు రాష్ట్రాల పెద్దలు ఇప్పుడు మీడియాపై ప్రేమ ఒలక బోస్తున్నారు. ఎపిలో ఇప్పుడు పోలీసు కేసులు, వేధింపులు, పత్రికా స్వేచ్ఛ అంటూ జగన్ అండ్ కో గగ్గోలు పెట్టడం చూస్తే జాలేస్తోంది. అయితే గతంలో అధికారం అడ్డు పెట్టుకుని అక్రమాలకు పాల్పడి, అవినీతికి తెగించి, ఆర్థిక విధ్వంసం సృష్టించిన వారిపై చర్యలు ఉండాల్సిందే. లేనిపక్షంలో అలాంటి వారిలో లెక్కలేనితనం పెరుగుతుంది. తమకేమీ కాదులే అన్న ధీమా రాజకీయ నేతల్లో రాకూడదు. జవాబుదారీతనం తీసుకుని రావాలి. ఇకపోతే గత పదేళ్లలో తెలంగాణను దోపిడీ చేశారని, కాళేశ్వరంను ఎటిఎంలా వాడుకున్నారని గగ్గోలు పెట్టిన బిజెపి నేతలు కూడా బిఆర్ఎస్ నేతలతో కలసి వంతపాడడం శోచనీయం. ఇద్దరు కేంద్రమంత్రులు తెలంగాణ అభివృద్ధి గురించి కాకుండా ప్రభుత్వం కాళ్లల్లో కట్టెల్లు పెడుతున్నారు. బిఆర్ఎస్ నేతలకు వంత పాడేలా విమర్శల చేస్తున్నారు. నిర్మాణాత్మక పాత్ర పోషించడలో వీరు విఫలం అయ్యారు. నరేంద్రమోడీ పాలనే బ్రహ్మాండంగా ఉందని ప్రచారం చేసుకుంటే సరిపోదు. ప్రజలు ఏమనుకుంటున్నారో ఈ ఇద్దరు కేంద్రమంత్రులు తెలుసుకుంటే మంచిది. క్షేత్రస్థాయిలో ప్రజల మనోభావాలను, వారు ఎదుర్కొంటున్న సమస్యలను బిజెపి చర్చించాలి. అలా చేసే ధైర్యం ఉందా అన్నది చెప్పాలి.

# విభిన్న దృశ్యాల కథలు

కొత్త దృక్పథాలు, ఆలోచనలు, జీవన దృష్టి, అనువాదాల ద్వారానే పరివ్యాప్తం అవుతాయి. బహు భాషలకు నిలయమైన భారతవనిలో, భాషాజాతుల మధ్య భావ సమైక్యతకు దోహదం చేసినవి అనువాదాలే. తెలుగువారు ప్రారంభం నుంచి అనువాదంలో అభినివేశాన్ని చాటుతూ వచ్చారు. తెలుగు నాట మొదటి నుంచి అనువాదాన్ని కూడా మూల రచనగానే అంగీకరించడం, గౌరవించడం జరిగింది. ఇతర భాషల రచనల అనువాదం వల్ల తెలుగు సాహిత్యం గణనీయంగా ప్రభావితమైంది. 'సాహిత్య వికాసానికి, భావాత్మక ఐక్యతకు, నవీన భావజాలాల పరివ్యాప్తికి, భారతీయ భాషల మధ్య సమన్వయ సాధనకు, భిన్న భాషల్లోని సాహిత్యాల పరస్పర అనువాదం ఎంతైనా అవసరం' అంటారు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత వెన్నా వల్లభరావు. భారతీయ భాషల సాహిత్యం ఇంచు మించు అనువాదాలతోనే ప్రారంభమైంది. అనువాదం అంటే కథలనో లేదా రచనలనో వేరే భాషలోకి తర్జుమా చేయడం మాత్రమే కాదు. ఆయా ప్రాంతాల సంస్కృతి, జీవన స్థితిగతులు పాఠక ప్రపంచానికి అందజేయడం. మనిషి ఎన్ని ప్రాంతాలు తిరిగినా, మరెన్నో వింతలు విడ్డురాలు చూసినా ఇంకా చూడాల్సినవి, తెలుసుకోవలసినవి మిగిలే ఉంటాయి. అలా మిగిలిన వాటిల్లో కొన్నిటిని తమదైన శైలిలో మనకు అందజేయడమే అనువాదం శ్రీమతి కల్పనా కోనేరు వృత్తి రీత్యా విశ్రాంత వ్యాయామోపాధ్యాయిని. స్వతంత్ర రచనలు చేయడంలో అందె వేసిన చెయ్యి. మనవడికి హిందీ నేర్పడం కోసం, ఆనాడు తాను పనిచేస్తున్న ప్రాంతంలో ఉపాధ్యాయులకై వెతకగా ఎవ్వరూ కానరాలేదు. సహజంగానే ఉపాధ్యాయురాలు, ఇంకేముంది? నేనే నేర్చుకుంటే పోలా! అనుకుంటూ ముందుగా తాను నేర్చుకుని, తన మనవడికి నేర్పడం ప్రారంభించారు. ఆమెలోని రచయిత ఊరుకో నిస్తుందా? హిందీ సాహిత్యంతో అనుసంధా నించింది. అనువాద రచయితగా మార్చింది. ప్రేమ్ చంద్, విశ్వంభర్ నాథ్ కౌశిక్, మహా దేవి వర్మా, ఆగేరు, హరి శంకర్ పరసాయి, సుదర్శన్, మన్నూ భండారి,




అన్నపూర్ణా నంద్ వర్మ, కృష్ణ చందర్ లాంటి హిందీ కథా రచయితల విశిష్ట మైన కథలను చాలా సమర్ధవంతంగా తెలుగు చేశారు.

'దర్పణం' పేరిట పన్నెండు కథల సంపుటిని తెలుగు పాఠకులకు అందించారు. ఈ సంపుటిలో మొదటి కథ ప్రసిద్ధ హిందీ రచయిత శ్రీ కృష్ణ చందర్ రచనను 'బాధ్యత' పేరుతో మన ముందుకు తెచ్చారు. ప్రభుత్వ యంత్రాంగంలోని బాధ్యతా రాహిత్యాన్ని బట్టబయలు చేసి, జీవితంలో ప్రతి మనిషి ప్రభుత్వ కార్యాలయానికి వెళ్ళినప్పుడు ఎదురయ్యే శాఖల పరిస్థితులు, పనితీరుపై వ్యంగ్యాస్త్ర, హాస్యపు పూతతో ఆవిష్కరించారు. చివర్లో కథ విషాదాంతంతో మనస్సు బరువెక్కిస్తుంది. ఇద్దరు స్నేహితురాళ్ళ వైవిధ్యమైన వ్యక్తితత్వాల మధ్య సమాజంలోని అనాధల సమస్యకు మానవత్వ ప్రతిరూపమే 'ఇద్దరు కళాకారులు' కథ. 'శరణ దాత' కథ దేశ విభజన నాటి పరిస్థితులకు దర్పణం పట్టి మానవత్వపు విలువల్ని చాటి చెప్పింది. ఇది సచ్చిదానంద హీరానంద వత్యయన్ రచన. హిందూ ముస్లింల మధ్య, అప్పటి తరం ప్రేమ, వాత్సల్యాలను తెలియచెబుతోంది ఈ కథ. మున్షి ప్రేంచంద్ రాసిన 'మంత్ర'ను 'క్రమశిక్షణ' పేరుతో అనువదించారు. క్రమశిక్షణ అనేది వ్యకిత్వాన్ని తీర్చిదిద్దుకోవడానికే కానీ అది ఏ వ్యక్తిని శిక్షించడానికి కాదని, అదో కిరీటం కాదని ఈ కథ వివరిస్తుంది.

'తాయీ' కథ సంతానం లేని మహిళల ప్రవర్తనకు అద్దం పడుతూనే, ప్రేమ, ఆపేక్షలలో స్త్రీలను అగ్రస్థానం ఇవ్వడం వాస్తవికంగా తోస్తుంది. ఓంప్రకాష్ వాల్మీకి కథను 'వలసజీవులు' పేరుతో అందించారు. ఈ సంపుటిలో అగ్రస్థానం ఈ కథదే. నాటి నుండి నేటి వరకు పెట్టుబడి శ్రమను దోచుకోవడం, శ్రామిక స్త్రీ యజమాని సొత్తు అన్న భావజాలం నేటికీ సజీవంగా ఉండడం కఠోర వాస్తవం. 'అంతులేని కథ శ్రామికుల ఆకాంక్షలు, వాటిని అందుకునే మార్గంలో ధన మదాందులైన యజమానుల వైఖరి వల్ల వ్యధలను భరించే మహిళల కన్నీళ్ల కథ. తమకొక చిన్న గూడు ఏర్పరుచుకోవాలన్న చిన్న కోరిక కోరుకునే మహిళ కథ. కడు పేద విద్యార్థి గురు దక్షిణగా పుచ్చకాయ సమర్పిస్తే, ఆనందపరవశురాలైన పంతులమ్మ కథ మరొకటి. వెరసి ఈ పన్నెండు కథలు పాఠకులకు పన్నెండు విభిన్న పరిస్థితులను కళ్లకు కడతాయి, ఆలోచింపచేస్తాయి. అనువాదకురాలిగా తన తొలి ప్రయత్నంలోనే పేరెన్నిక గన్న హిందీ రచయితల కథలను ఎంచుకోవడం కోనేరు కల్పన పట్టుదలను సూచిస్తుంది. దీనివల్ల తెలుగు పాఠకులకు ఉత్తర భారతదేశ సంస్కృతి తెలియచెప్పడంలో తన వంతు పాత్రను పోషించారు. అభిరుచి వున్న పాఠకులకు షడ్రసోపేత విందు చేసారనడంలో అతిశయోక్తి లేదు. హిందీ నుంచి తెలుగు భాషలోకి అనువదించి నట్లు గానే, మన తెలుగు సాహిత్యంలోని ఆణిముత్యాల్లాంటి రచనలను హిందీ భాషలోకి అనువాదించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అప్పుడే తెలుగు వారి సంస్కృతీ సంప్రదాయాలను, ఇక్కడి స్థితిగతులను., వర్తమాన సమాజపు సంఘర్షణను, మన రచయితల సృజనను ప్రపంచానికి చాటిన వారమవుతాము.

# ఇక్కడిలా.. అక్కడలా!

తాజాగా రెండు సమస్యలు ఓ కుదుపు కుదిపేస్తున్నాయి. జీవో 29ఇష్యూతో గ్రూప్-1 పరీక్షలు జరుగుతాయా లేదా? అన్న గందరగోళానికి గురిచేశాయి. వేలాది నిరుద్యోగుల జీవితాలకు ముడిపడి ఉన్న ప్రశ్న ఒకటి అయితే, రెండోది సికింద్రాబాద్ ముత్యాలమ్మ టెంపుల్ ఎపిసోడ్. గోతికాడ నక్కల్లా ఎదురుచూస్తున్న ఈ శక్తులకు ప్రభుత్వ అనాలోచిత చర్యలు, పనులు అయాచిత ఆయుధాలుగా ఉపయోగపడు తున్నాయి. భాధితులు, సమస్యను ఎదురుకునే వాళ్లు ఈ విచక్షణను అర్థం చేసుకోకుండా ముందుకుపోతే యావత్ సమాజానికే నష్టం. నేడు రాష్ట్రంలో బీజేపీ చేస్తున్న పని అచ్చంగా అలాగే ఉంది. పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వాలు నిర్ణయం తీసుకున్నప్పుడల్లా ఏదో ఒక వివాదం వెంటాడుతున్నది. తెలంగాణ ఏర్పడిన తర్వాత చేసిన ప్రయత్నాలు సక్సెస్ కాలేదు. ఎట్టకేలకు గతేడాది నోటిఫికేషన్ వెలువడింది. ఇప్పటికి మూడుసార్లు ప్రిలిమ్స్ జరిగినా మెయిన్స్ సమయానికి ఏదో ఒక వివాదం ముంచుకొచ్చి నిర్వహణ సందిగ్ధంలో పడుతున్నది. తాజాగా జీవో 29 ఇష్యూతో షెడ్యూలు ప్రకారం పరీక్షలు జరుగుతాయో లేవో అనే కన్‌ఫ్యూజన్ అభ్యర్థులను కలవరపెట్టింది. పరీక్షల నిర్వహణకు హైకోర్టు గ్రీన్ సిగల్ ఇచ్చినా రాష్ట్రంలో ఆందోళనలు ఆగలేదు. సోమవారం (మరికొన్ని గంటల్లో పరీక్ష అనగా) సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం పిటిషన్‌పై జోక్యం చేసుకునేందుకు, మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసేందుకు నిరాకరించింది. దీంతో సోమవారం యధావిధిగా పరీక్షలు జరిగాయి. వేలాది మంది అభ్యర్థులు హాజరయ్యారు. కానీ, ఈ సమస్యపై ఉద్యోగార్థుల పక్షం మేమున్నామంటూ తెగ ఫోజులుకొడుతూ, రిజర్వేషన్ల గురించి సైతం గొంతు చించుకుంటూ ఆందోళనకు దిగితున్నట్టుగా బీజేపీ చేసిన హడావిడి అంతా ఇంతా కాదు. తెలంగాణలో రిజర్వేషన్ల అమలుకు డిమాండ్ చేస్తున్న కేంద్రమంత్రులు%ొ%కేంద్రంలో మాత్రం ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటు పరం చేస్తూ రిజర్వేషన్ల ఊసేలేకుండా చేస్తున్నారు. ఇది ఆ పార్టీ ద్వంద్వ వైఖరికి నిదర్శనం. ప్రతియేటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామంటూ ఊరించి అధికారంలోకి వచ్చిన




మోడీ సర్కార్ ఆచరణలో యువతరాన్ని నిట్ట నిలువునా ముంచేసింది. మోడీ ప్రభుత్వ విధానాల కారణంగా పనిచేసే చేవ ఉన్నా.. ఉపాధి దక్కక యువతరం ఈసురో మంటోంది.. భారత్‌లో ఉపాధి పరిస్థితి భయంకరంగా ఉందని నిరుద్యోగిత రేటు, కీలక లేబర్ సూచీలు స్పష్టం చేస్తున్నాయి. వాటిపై పల్లెత్తుమాట మాట్లాడని సదరు బీజేపీ నేతలు రాష్ట్రంలో మాత్రం నిరుద్యోగం గురించి, రిజర్వేషన్ల అమలు గురించి రచ్చ చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉంది.

తాజాగా సికింద్రాబాద్ ముత్యాలమ్మ టెంపుల్ ఎపిసోడ్‌లో ఆర్మూర్ బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి 'హిందువులకు చీమునెత్తురు లేదా, గాజులేసుకుని కూర్చొన్నారా' అంటూ విరుచుకుపడ్డారు. ఇక మాధవిలత అయితే మాటకు ముందు, వెనక సనాతనం, హిందుత్వం తప్ప ప్రజలు, ప్రజా సమస్యలు అనే ముచ్చటే వుండదు. ఈ వివాదంపై ఒక కేంద్ర మంత్రి సమగ్ర విచారణ జరగాలని అంటారు. ఇంకో కేంద్ర మంత్రి వెళ్లి నోరు పారేసుకుంటున్నారు. ఆ పార్టీ మరో ఎంపీ ధర్మపురి అరవింద్ సైతం స్పందిస్తూ 'నుపుర్‌శర్మకు మద్దతు తెలిపినందుకు రాజస్థాన్‌లో ఒకర్ని గొంతుకోసి చంపేశారనీ, దాన్ని గుర్తుపెట్టుకోవాలి' అని హెచ్చరికలు జారీ చేశారు. అంటే రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఇదే పద్ధతిని అనుసరిస్తారా? అన్న ప్రశ్నకు ఆయన సమాధానం చెప్పాలి. మత విద్వేషాల మీద వున్న శ్రద్ధ ప్రజా సమస్యల పరిష్కారంపై ఉండదు. రోజుకొక వివాదం.. పూటకో రచ్చ చేస్తోన్న నేతల తీరు మారదా? 'మత మీటర్ లేనిదే కిలోమీటర్ నడవలేని నేతలు' తెలంగాణలో పాగా కోసం ఏ చిన్న అవకాశాన్ని వదులుకోవడం లేదు.

ప్రతిపక్ష పార్టీల ఏలుబడిలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిరపరిచేందుకు చేయని కుట్ర, కుతంత్రం లేదు. ఆ కోణంలోనే రాష్ట్ర ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు, అప్రదిష్ట పాల్జేసేందుకు ఇక్కడి కమలం నేతలు పావులు కదుపుతున్నారనే వాదనలను మనం కొట్టిపడేయలేం. అందులో భాగంగానే ప్రతి సందర్భాన్ని తనకు అవకాశంగా మార్చుకుంటుంది. ప్రభుత్వ తప్పిదాలే వారికి అవకాశం కల్పిస్తున్నాయి. ఈ మతతత్వ శక్తులను రానీయకుండా అడ్డుకట్ట వేయాలంటే ప్రజల సమస్యలను, నిరుద్యోగుల భయాలను నివృత్తి చేసి, రిజర్వేషన్లకు ఇబ్బందిగా ఉన్న 29జివోను ప్రభుత్వం విరమించుకోవాలి. ఆ సమస్యను పరిష్కరించాలి. మతపరమైన ఘర్షణలు తలెత్తకుండా సామరస్య పూర్వకంగా వ్యవహరించాలి. లౌకికపక్షాలను కలుపుకుని ముందుకు సాగాలి. అప్పుడే గుంటనక్కలకు చెక్ పెట్టగలం!

# జీఓ 29 ను రద్దు చేసి గ్రూప్ వన్ ఉద్యోగాలు నియమించాలి

- ఓపెన్ కేటగిరి అంటే ప్రతిభ ఉన్న ప్రతి ఒక్కరి హక్కు
- రాష్ట్ర అధ్యక్షులు లంబాడి హక్కుల పోరాట సమితి డిమాండ్



**షాద్ నగర్, అక్టోబర్ 21 (జర్నలిస్ట్ డైరీ)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జిఓ 29 ను రద్దు చేయాలని లంబాడీ హక్కుల పోరాట సమి రాష్ట్ర అధ్యక్షులు ముడావత్ రాంబల్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయ మాట్లాడుతూ.. జీవో నెంబర్ 29 ఇది భారత రాజ్యాంగానికి వ్యతిరేక జీవో అని వ్యాఖ్యానించారు. ఈ జీవో వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు ఉద్యోగ నియామకాల్లో తీరని అన్యాయం జరుగుతుందని అన్నారు. ఈ వర్గాలకు ఓపెన్ క్యాటగిరిలో రానివ్వకుండా జరుగుతున్న పెద్ద కుట్ర జరుగుతుందన్నారు. ఓపెన్ క్యాటగిరి అంటే ఇది కేవలం ఓసిలదే కాదని, ఓపెన్ క్యాటగిరి అంటే ప్రతిభ ఉన్న ప్రతి ఒక్కరిదని వ్యాఖ్యానించారు. ఆర్టికల్ 16 ప్రకారం ఆర్థికంగా, సామాజికంగా వెనకబడిన వర్గాలకు ముందుకు తీసుకురావడానికి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కల్పించిన రాజ్యాంగ హక్కు ఉద్యోగం, కానీ ఈ ఈడబ్ల్యూసీ రిజర్వేషన్ తీసుకువచ్చి బడుగు, బలహీన వర్గాల ప్రజలను ఉద్యోగాలలో తీరని అన్యాయం చేస్తుందన్నారు. దీంతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రజలను రిజర్వేషన్ వరకు మాత్రమే పరిమితం చేసి ఎంత ప్రతిభ ఉన్న ఓపెన్ కేటగిరి పోస్టుల్లో రానీయకుండా చేసే కుట్రనే జీవో నెంబర్ 29 అని తెలిపారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీలపైన పెద్ద కుట్ర జరుగుతుందన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఓపెన్ కేటగిరీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రజలను ఉద్యోగ నియామకాల్లో ప్రతిభ ఉన్న రానీయకుండా చేసి కేవలం రిజర్వేషన్లకే పరిమితం చేసే కుట్ర కనబడుతుందని వ్యాఖ్యానించారు. నూటికి పది శాతం కూడా లేని ఓసిలకు ఈబిసి రిజర్వేషన్లు 10 శాతం కేటాయించారని, మేము దీనికి వ్యతిరేకం కాదన్నారు. కానీ ఓపెన్ కేటగిరీలో ప్రతిభ ఉన్న ప్రతి ఒక్కరికి రా రావలసిన ఉద్యోగాలను వారికి రాకుండా కావాలనే రిజర్వేషన్ కు పరిమితం చేస్తున్నారు కాబట్టి వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 29 రద్దు చేయాలని లంబాడి హక్కుల పోరాట సమితి డిమాండ్ చేసింది. కాంగ్రెస్ పార్టీ రెండు నాలుకల ధోరణితో పైన రాహుల్ గాంధీ చెప్పే విధానం వేరు.. క్రింద రేవంత్ రెడ్డి పాటించే విధానం వేరు అని అన్నారు. రాహుల్ గాంధీ అన్ని వర్గాలను ఎస్సీ, ఎస్టీ, బీసీలతోపాటు ప్రతిభ ఉన్న ప్రతి ఒక్కరూ ఓపెన్ కేటగిరి లో నియమించాలని చెప్తే క్రింద ఉన్న రేవంత్ రెడ్డి మాత్రం ఓసి అంటే ఓన్లీ అగ్రకులాలకు సంబంధించిన పోస్టులని మాత్రమే అని అర్థం వచ్చే విధంగా ప్రవర్తిస్తూ ఓపెన్ కేటగిరి అంటే ఓన్లీ అగ్రకులాల వారు మాత్రమేనని 50 శాతం ఉద్యోగాలను వారి బంధువులకు కట్టబెట్టే కుట్ర జరుగుతుందన్నారు. 100 పోస్టులు ఉంటే ప్రతిభ ఉన్న 50 శాతం మందిని ఓపెన్ పోస్టులో తీసుకున్న తర్వాత 16 శాతం ఎస్సీలు, 10 శాతం ఎస్టీలు, 27 శాతం బీసీలు మిగిలిన పోస్టులలో ప్రతిభ ఉన్న ప్రతి ఒక్కరికీ హక్కు గ్రూప్ 1 పోస్టులలో జీవో 29 ఈ విధానాన్ని రద్దు చేసి మెయిన్స్ లో అర్హత సాధించిన వారికి ఓపెన్ క్యాటగిరిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రతిభ ఉన్న ప్రతి ఒక్కరికి అవకాశం వచ్చే విధంగా ఉద్యోగ నియామకాలు చేపట్టాలన్నారు. జీవో 29 ద్వారా తీరని అన్యాయం జరుగుతుందని అందుకోసమే జీవో నెంబర్ 29 రద్దు చేసి ఇంతకుముందు ఏ విధంగా ఉందని, ఆ విధానంతోనే ఉద్యోగ నోటిఫికేషన్ వేయాలని, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తుందని, దీనికోసం ఈనెల 23 వ తేదీన సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో మధ్యాహ్నం రెండు గంటలకు లంబాడి హక్కుల పోరాట సమితి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణ సంస్కృతి, మతసామరస్యానికి నిదర్శనం

- ఎలికట్ట దర్గాలో ప్రార్థనలు చేసిన ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి



**షాద్ నగర్, అక్టోబర్ 21 (జర్నలిస్ట్ డైరీ)**

తెలంగాణ సంస్కృతి, మతసామరస్యానికి నిదర్శనమని, భిన్నత్వంలో ఏకత్వంలో ఇక్కడి ప్రజలు తమ ఇష్టదైవాలను కొలుస్తూ మొక్కులు తీర్చుకుంటారని మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి అన్నారు. ఫరూక్ నగర్ మండలం ఎలికట్ట గ్రామంలోని హజరత్ సయ్యద్ అబ్బాషా ఖాద్రీ చిస్తీ ఉర్ఫియాత్ పీర్ గయాబ్ షా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం మాట్లాడారు. దర్గా ఉర్సు ఉత్సవాలలో భాగంగా బాబాకు గంధం సమర్పించి ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. దర్గా వద్ద ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహించే విధంగా దర్గా కమిటీ సభ్యులు మౌలిక వసతులు కల్పించారని, వారు పనితీరు ఆదర్శనీయమని అన్నారు. అదేవిధంగా ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి దర్గా కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎలికట్ట గ్రామమాజీ సర్పంచ్ యాదయ్య, మాజీ ఉపసర్పంచ్ మల్లేష్, వార్డు సభ్యులు అశోక్ గౌడ్, దర్గా ఉర్సు నిర్వాహకులు అన్వర్, అజ్జు, అబ్బు, నరేష్ గౌడ్ లు పాల్గొన్నారు.

## గున్న భీమయ్య ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి



**షాద్ నగర్, అక్టోబర్ 21 (జర్నలిస్ట్ డైరీ)**

ఎలికట్ట గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు గున్న భీమయ్య యాదవ్ కుమారుడు గున్న మల్లేష్ యాదవ్ అనారోగ్యంతో మృతి చెందడం పట్ల మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాపరెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎలికట్టలోని వారి నివాసానికి వెళ్లి గున్న మల్లేష్ పార్థీవ దేహానికి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం గున్న భీమయ్యను ఆయన పరామర్శించారు. గున్న భీమయ్యను పరామర్శించిన వారిలో కాంగ్రెస్ నాయకులు అగ్గనురు విశ్వం, కట్ట వెంకటేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## ఏవీ బ్యాంకిటల్స్ ప్రారంభోత్సవ పూజ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి



**షాద్ నగర్, అక్టోబర్ 21 (జర్నలిస్ట్ డైరీ)**

షాద్ నగర్ పట్టణంలో హాజిపల్లి రోడ్డులో గల ఏవీ కన్వెన్షన్ లో నూతనంగా ఏర్పాటు చేసిన ఏవీ బ్యాంకిటల్ ప్రారంభోత్సవ పూజ కార్యక్రమంలో పాల్గొని షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపార. అనంతరం యాజమాన్యం మాజీ ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో షాద్ నగర్ మున్సిపల్ మాజీ చైర్మన్ విశ్వం, కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్ట వెంకటేష్ గౌడ్, రఘుమా రెడ్డి, అన్నారం మాజీ సర్పంచ్ రాములు గౌడ్, అనూప్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేసిన ఖిలానగర్ యూత్ సభ్యులు

**వలిగొండ అక్టోబర్ 21 (జర్నలిస్ట్ డైరీ) యాదాద్రి**

వలిగొండ ఖిలనగర్ కు చెందిన తోటకూరి చంద్రయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబానికి ఖిలానగర్ ఆదర్శ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో 22900 వేల రూపాయలను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మె లింగయ్య (పెద్దకుర్మ) బత్తిని దేవేందర్ , దయ్యాలా వినోద్, ఎమ్మె కుమార్, ఎమ్మె శేఖర్, కౌడే కృష్ణ, ఎడవల్లి అనిల్, ఎమ్మె వెంకటేష్, ఎమ్మె నవీన్, పబ్బు శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు,

## నవంబర్ 5న ఖమ్మంలో జరిగే రాష్ట్రస్థాయి గిరిజన సమ్మేళనం విజయవంతం చేయండి

- తెలంగాణ గిరిజన సంఘం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ఈశ్వర్ నాయక్



**షాద్ నగర్, అక్టోబర్ 21 (జర్నలిస్ట్ డైరీ)**

ప్రజా ఉద్యమాల సారథి గిరిజన సంఘం వ్యవస్థాపక నాయకులు అమరజీవి గుగులోత్ ధర్మా ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని రాష్ట్రస్థాయి గిరిజన సమ్మేళనం నవంబర్ 5, 6 తేదీలలో ఖమ్మం జిల్లాలో జరుగుతున్న గిరిజన సమ్మేళనం విజయవంతం చేయాలని కోరుతూ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఈశ్వర్ నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గూగులోత్ ధర్మ ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు కలిగిన ప్రజానాయకుడని అన్నారు. మైదాన ప్రాంత గిరిజనుల సమస్యల కోసం నిరంతరం పోరాటం చేసిన వ్యక్తి తరతరాలుగా వెనకబాటుకు గురైన తండాలు, గూడేలలో మంచినీళ్లు, కరెంట్, రోడ్డు వంటి మౌలిక సదుపాయాలు మెరుగుపరిచేలా, తాండాలను గ్రామపంచాయతీలుగా గుర్తించాలని డిమాండ్ తో పాటు అనేక పోరాటాలు నిర్వహించారన్నారు. గిరిజన ఉద్యమాలకు అంకితమై పనిచేసిన గొప్ప నాయకుడు ధర్మ అని, గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలు, సంస్కృతి సంప్రదాయాలు, కాపాడుకోవడం కోసం అనేక పోరాటాలు చేశారని వారన్నారు. పేదలపై, గిరిజనులపై రోజుకు దాడి తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో ధర్మ స్ఫూర్తితో రాబోయే కాలంలో మరిన్ని ఉద్యమాలు పోరాటాలు నిర్వహించడం కోసం రాష్ట్రంలో గిరిజన ఉద్యమ నాయకులు, మేధావులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, విద్యార్థులు అందరికీ ఆహ్వానించి నవంబర్ 5, 6 తేదీలలో జరిగే గిరిజన సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## 29న జరిగే సెమినార్ ను జయప్రదం కొరకు కరపత్రం విడుదల

**షాద్ నగర్, అక్టోబర్21 (జర్నలిస్ట్ డైరీ)**

ప్రజా సమస్యలు పరిష్కార మార్గాలు అనే అంశంపై అక్టోబర్ 29 న డివిజన్ స్థాయి సెమినార్ మినీ యూనివర్సల్ హాల్ లో జరుగుతుందని ఈ సెమినార్ కు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తో పాటు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కలకొండ కాంతయ్య, ఎన్ బాల మల్లేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అతిథులుగా హాజరవుతున్నారు. కావున వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధుల జంగయ్య, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు టంగుటూరి నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. ప్రజలకు అనేక



రకమైన సమస్యలు ఉన్నాయని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, మహిళలకు రూ.2500 నగదు తదితర సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం క్లారిటీ ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. దాంతో పాటు కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న ఉపాధి సమస్యల పెండింగ్ బిల్లులతో పాటు రూ.2.61 లక్షలు కేటాయించి రోజు కూలి రూ.600 చొప్పున 200 రోజులు పనులు కల్పించాలని అన్నారు. ఉపాధి హామీ పనులకు సంబంధించిన పనిముట్లు ఇవ్వాలని ఈ సెమినార్ లో డిమాండ్ చేస్తామన్నారు. కావున పేద ప్రజలు వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు. కరపత్రం బ్లాక్ ఆఫీస్ అంబేద్కర్ విగ్రహం ముందు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ చౌదరిగూడ మండల కార్యదర్శి జి వెంకటేష్, సిపిఐ కొందుర్గు మండల కార్యదర్శి బి నరసింహ, వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ నాయకులు రమేష్ యాదవ్, కే రాజు నాయక్, ఎం కృష్ణ, రమేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు అమరవీరులకు ఘన నివాళి

**వికారాబాద్ అక్టోబర్ 21: (జర్నలిస్ట్ డైరీ)**

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం వికారాబాద్ జిల్లా స్థానిక జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్ లో పోలీసు అమరవీరులకు నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి, అడిషనల్ ఎస్ పి లు రవీందర్ రెడ్డి, మురళీధర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పోలీసు అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలి





- కొత్తూరు ఎస్సైలు జి.శ్రీనివాస్, మురళి గౌడ్
- కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు

**షాద్ నగర్, అక్టోబర్21 (జర్నలిస్ట్ డైరీ)**

పోలీసు అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలని కొత్తూరు ఎస్సైలు జి.శ్రీనివాస్, మురళి గౌడ్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని (ఫ్లాగ్ డే) పురస్కరించుకుని కొత్తూరు పోలీస్ స్టేషన్ నుంచి జ్యోతిరావు పూలే విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కొత్తూరు ఎస్సైలు జి.శ్రీనివాస్, మురళి గౌడ్, మున్సిపల్ చైర్ పర్సన్ బాతూక దేవేందర్ యాదవ్, జాండగూడెం సుదర్శన్ గౌడ్, వీరమోని దేవేందర్ ముదిరాజ్, మాదారం నరసింహ గౌడ్, జండగూడెం అనిత శ్రీనివాస్ గౌడ్, కర్రోల్ల సురేందర్, చిల్కమర్రి నరసింహ, బండి శ్రావణ్, చింత తేజేశ్వర్, హసేన్, విక్రమ్ తో పాటు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నక్సలైట్ల చేతిలో అసువులు బాసిన అమరవీరుల త్యాగాలు వృధా పోవని, వారి త్యాగాల ద్వారా నేడు ప్రశాంత వాతావరణం నెలకొందని వారు అన్నారు.

# షాద్ నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనానికి శంకుస్థాపన







- హాజరైన ఎమ్మెల్యే శంకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం
- విశిష్ట అతిథులుగా మాజీ ఎమ్మెల్యేలు బక్కని, చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, భీష్మ కిష్టయ్య

**షాద్ నగర్, అక్టోబర్ 21 (జర్నలిస్ట్ డైరీ) :**
ధాతల సహకారంతో నిర్మించనున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవన శంకుస్థాపన కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, మాజీ ఎమ్మెల్యేలు మాజీ ఎమ్మెల్యేలు బక్కని నరసింహులు, భీశ్వ కిష్టయ్య బక్కని నర్సింహులు, పుర ప్రముఖులు, పూర్వ విద్యార్థులు, కళాశాల విద్యార్థులు, నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. శంకుస్థాపన అనంతరం జరిగిన సభలో విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్సీ కోదండరాం ప్రసంగిస్తూ.. చదువుతూనే సమాజంలో గౌరవం లభిస్తుందని అన్నారు. చదవకపోతే అరేయ్ రాములు.. ఒరేయ్ రాములు అంటూ సంభోదిస్తారని చదువుకున్నవాడిని సార్ అంటూ సమాజం గౌరవిస్తుందని ఉదహరించారు. దురదృష్టవశాత్తు సమాజంలో నేడు విద్య అంగడి సరుకు అయిందని అలా జరుగొద్దని అన్నారు. విద్యకు పెద్దపీట వేసిన నాడే సమాజంలో మార్పు లభిస్తుందని అన్నారు. షాద్ నగర్ పట్టణంలో దాతల సహకారంతో దాదాపు పదికోట్ల రూపాయల అంచనాలతో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం నిర్మించడం పట్ల ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇంత గొప్ప మనసున్న దాతలకు, ఈ కార్యక్రమం కోసం ముందుకు వచ్చిన స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను ప్రొఫెసర్ కోదండరాం అభినందించారు. షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తలపెట్టిన ఈ కార్యక్రమం ఓ బృహత్తర యజ్ఞం లాంటిదని కొనియాడారు. దీనికి తనవంతు సహకారం అందిస్తానని అన్నారు. సమాజంలో రాజకీయపరంగా ఇది ఒక కొత్త ఒరవడి అని అన్నారు. ఎంతసేపు నా ఇల్లు నా పిల్లలు అంటూ వ్యక్తిగతంగా ఆలోచించే ఈ రోజుల్లో సమాజం కోసం పరితపించే ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఇలాంటి వారు చాలా అరుదని కొనియాడారు. బ్రిటీషర్ల తొత్తులైన రాజులు, నవాబులు, సంస్థానాధీశులపై తిరుగుబాటు చేసిన యోధుడు, ప్రముఖ విప్లవకారుడు తుర్రేబాజ్ ఖాన్ పోరాట పటిమ గావించిన షాద్ నగర్ నియోజకవర్గంలో మరోమారు మనకి తెలంగాణ విముక్తి కోసం పోరాడిన పట్టుదల ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ లో కనిపించిందని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం ప్రస్తావించడం విశేషం. పోరుబాటలో మరణం తధ్యమన్న చేదు నిజం తెలిసి కూడా పరాయిపాలకులను తరిమి కొట్టేందుకు తుర్రె బాజ్ ఖాన్ నడుం కట్టారని, ఆయుధం చేతపట్టి కదన రంగాన అరివీర భయంకరులై పోరాడి అమరులయ్యారు. ఆ కోవకు చెందిన యోధులలో పఠాన్ తుర్రేబాజ్ ఖాన్ ఒకరని అలాంటి గడ్డపై విద్య పరంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ లాంటివారని అన్నారు. భవిష్యత్తు తరాలకు విద్యను ఇలాంటి స్వార్థం లేకుండా అందించడం గొప్ప విషయం అని కొనియాడారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వమైన, స్వతహాగా తానైన విద్య, వై రెండింటికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతామని అన్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ సాధకులలో అతి ముఖ్యమైన ఆచార్య కోదండరాం రావడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఎన్ని కోట్లయినా సరే రాజీ లేకుండా అత్యాధునిక సదుపాయాలతో కళాశాలను నిర్మిస్తామన్నారు. ఎందుకు సహకరించిన ధాతలు అందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా చేపడుతున్న ఈ మంచి కార్యానికి ప్రతి ఒక్కరు తమ సహకారం అందించడం సంతోషకరమన్నారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు గురించి స్పందిస్తూ ఆయన గుడిని బాగు చేస్తుంటే, నేను బడిని బాగు చేస్తున్నానని ఈ రెండు చాలా గొప్ప కార్యాలని చమత్కరించారు. దాతలు అందించిన వాటిలో రూపాయి కూడా వృధా చేయకుండా కళాశాలను నాణ్యతగా నిర్మిస్తామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తాను కూడా చేయని పనిని తమ్ముడు శంకర్ చేయడం సంతోషంగా ఉందన్నారు. తన వల్ల కాదు అనుకుంటే ఏదీ జరగదని, ప్రయత్నం చేస్తే అన్ని సఫలం అవుతాయని పేర్కొన్నారు. ఒక పేదవాడిగా చదువుకోవడానికి తాను పడ్డ ఇబ్బందుల గురించి తెలిపారు. సంకల్పం ఎలా సహకారం అవుతుందనేది పద్యాల రూపంలో చెప్పి అలరించారు. రాజకీయాల్లో స్వార్థం పెరిగిపోయిందని ఎవ్వరం అందుకు అతీతులం కాదని కానీ నిరుపేద విద్యార్థులు, కష్టాల్లో ఉన్న వారి విషయంలోనైనా మానవత్వంతో ఆలోచించడం ప్రతి నాయకుడు నేర్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమానికి తన వంతు పూర్తి సహాయ సహకారాలను అందిస్తానని ఈ సందర్భంగా పేర్కొన్నారు. 1969- 70 దశకంలో నిర్మాణం జరుపుకున్న ఈ పాఠశాలలో తొలి విద్యార్థిని తానేనని మాజీ ఎమ్మెల్యే భీష్మ కిష్టయ్య తెలిపారు. తెలంగాణ ఉద్యమంతో పాటు, కళాశాల సమస్యలపై పలు పోరాటాలు చేశామన్నారు. ఈ కళాశాల నిర్మాణానికి ప్రతి ఒక్కరు తమ వంతు సహకారం అందించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇంత గొప్ప కార్యక్రమాన్ని చేపట్టిన వీర్లపల్లి వచ్చే విద్యా సంవత్సరం కల్లా దీనిని పూర్తి చేయాలన్నారు. విద్యార్థులు కూడా తమ నమ్మకాన్ని వమ్ము చేయకుండా చక్కగా చదివి మంచి ఫలితాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. సీనియర్ నేత నాగేళ్ల గోపాల్ గుప్త మాట్లాడుతూ.. తొలి దశలో ఇక్కడ కళాశాల ఏర్పాటు కోసం స్వతంత్ర సమరయోధుడు ఎన్.కె రంగారావు తో కలిసి తాను చేసిన కృషిని వివరించారు. ఈ కళాశాలను తిరిగి పునరుద్ధరించాలనుకోవడం అభినందనీయమన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు గంగిరెడ్డి మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేకు అందించిన ప్రజా ఎజెండాలో 21 వ అంశంగా పాఠశాల ఆధునీకరణ ఉందని, దానిని దృష్టిలో పెట్టుకొని ఏకంగా నిర్మాణానికి పూనుకోవడం ప్రశంసనీయమన్నారు. కమిషనర్ వెంకన్న, కౌన్సిలర్ కృష్ణవేణి, మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా కళాశాల నిర్మాణం నిమిత్తం భారీ ఎత్తున విరాళాలు అందించేందుకు పలువురు ముందుకు వచ్చారు. పెంజర్ల గ్రామానికి చెందిన యుగంధర్ రెడ్డి రూ.25 లక్షలు, సోమిరెడ్డి నరేందర్ రెడ్డి రూ.6 లక్షలు ప్రకటించారు. న్యాయవాది బసప్ప రూ.5 లక్షలు, దండు వాసు రూ.5 లక్షలు చొప్పున ప్రకటించగా, ఎండీ ఖాదర్ గోరి నవాజ్ గోరి బ్రదర్స్ రూ.1,08 లక్షలు నగదు రూపాయలను అందించారు. పలబట్ల పాండురంగం కళాశాలలో ఆరో ప్లాంట్ ను నిర్మిస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నేత ఎండి ఖాదర్ గోరి లక్ష రూపాయల నగదు వేదిక పైన అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు బక్కని నర్సింహులు, చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, బిశ్వ కిష్టయ్య, మాజీ జడ్పీటీసీలు మామిడి శ్యామసుందర్ రెడ్డి, వెంకట్ రాంరెడ్డి, తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి, కందివనం సూర్యప్రకాష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత తాండ్ర కాశినాథ్ రెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సర్వేశ్వర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ చీమ వెంకన్న, కౌన్సిలర్స్ అగ్గనూరు విశాల విశ్వం, పులిమామిడి లతాశ్రీ శ్రీశైలం గౌడ్, సరిత యాదగిరి యాదవ్, కృష్ణ వేణి, శ్రావణి, రాయికల్ శ్రీనివాస్,సర్వర్ పాషా, పట్టణ పుర ప్రముఖులు నాగిళ్ళ గోపాల్ గుప్తా, యాదవ చారి, కాంగ్రెస్ పార్టీ నేతలు చెంది తిరుపతి రెడ్డి, బాబర్ ఖాన్, రఘు నాయక్, అగ్గనూరు విశ్వం, బాలరాజు గౌడ్, చల్ల శ్రీకాంత్ రెడ్డి, గూడా వీరేష్, హరినాథ్ రెడ్డి, ఆగిర్యాల కృష్ణ రెడ్డి, జగదీష్ అప్ప, చెన్నయ్య, జమృత్ ఖాన్, అగ్గనూరు బస్వం, విజయ్ కుమార్ రెడ్డి, దంగు శ్రీనివాస్, గంగన్న గూడ దామోదర్ రెడ్డి, కట్ట వెంకటేష్ గౌడ్, ఆగిర్ రవి కుమార్ గుప్తా, పురుషోత్తం రెడ్డి, జితేందర్ రెడ్డి, రఘుమా రెడ్డి, ఖాదర్ గోరి, కేకే కృష్ణ, జాంగారి రవి, అక్రమ్, తోకల దామోదర్ రెడ్డి, నర్సింహా రెడ్డి, నవాజ్ గోరి, ఖాదీర్, దిలీప్ కుమార్, లింగారెడ్డి గూడ అశోక్, సీతారాం, జాంగారి జంగయ్య, డాకం మనీష్, అనిమి గణేష్ గౌడ్, సింగపగ అనిల్, సింగారం దర్శన్, బి ఆర్ ఎస్ నేతలు యుగేందర్, చెట్ల నర్సింహులు, పిల్లి శేఖర్, బీజేపీ నేతలు అందే బాబయ్య, చెంది మహేందర్ రెడ్డి, వంశీకృష్ణ, తెలుగుదేశం పార్టీ నేతలు చల్లా వెంకటేశ్వర్ రెడ్డి, లింగారం కుమార్ గౌడ్, అనంతయ్య, రిటైర్డ్ తహసీల్దార్ సరపు జగదీశ్వర్, నేతలు సిపిఎం రాజు, సురేష్ కుమర్, క్రాంతి కుమార్, దండు వాసు, జగదీష్ శర్మ, మోముల వినోద్ కుమార్, వనగా రౌత్ విశ్వనాథ్, గంగిరెడ్డి, నందిగామ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# భర్తతో గొడవపడి బయటకు వెళ్లిన గృహిణి అదృశ్యం



**ఎల్బీనగర్, అక్టోబర్21 (జర్నలిస్ట్ డైరీ)**
భర్తతో గొడవపడి బయటకు వెళ్లిన ఓ గృహిణి అదృశ్యమైన సంఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బండ్లగూడ నాగోల్ ఆనంద్ నగర్ కాలనీకి చెందిన పులి ప్రవీణ్ కుమార్, పులి స్వాతిలు భార్య భర్తలు. కాగా ఈనెల 19 వ తేదీన భార్యాభర్తలు గొడవపడ్డారు. దీంతో స్వాతి రాత్రి ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్ళింది. తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆందోళన చెందిన భర్త ప్రవీణ్ కుమార్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# హైవేల నిర్మాణాలు వేగవంతం చేయండి

ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి



**(జర్నలిస్ట్ డైరీ) /ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం**
జిల్లా మీదుగా సాగుతున్న జాతీయ రహదారుల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి ఎన్ హెచ్ఏఐ అధికారులను ఆదేశించారు. సంబంధిత అధికారులు ఎంపీని క్యాంపు కార్యాలయంలో మంగళవారం రాత్రి కలిసి.. మ్యాప్ ను చూయించగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ ఆ అధికారులతో మాట్లాడుతూ..నాగర్ కర్నూల్ -అమరావతి, సూర్యాపేట -జంగారెడ్డి గూడెం జాతీయ రహదారులు,ఖమ్మం -కొరివి హైవేలను కలుపుతూ.. ఖమ్మంలో నిర్మించే రింగ్ రోడ్డు, డీపీఆర్ వివరాలను ఆరా తీశారు. సూర్యాపేట - జంగారెడ్డి గూడెం మార్గంలో ఎక్కడెక్కడ సర్వీస్ పాయింట్లు ఇస్తున్నారని ఎంపీ ప్రశ్నించారు. ప్రస్తుతం నిర్మాణాల పురోగతి ఎలా ఉందో తెలుసుకుని.. పూర్తి వివరాలు తనకు అందజేయాలని కోరారు. దిశ సమావేశంలో కూడా చర్చించి సకాలంలో పూర్తి అయ్యేలా చూస్తానని ఎంపీ ఈ సందర్భంగా అన్నారు.

# ఎంపీ వద్దిరాజు ఎంబీబీఎస్ విద్యార్థిని దీప్తికి ఆశీస్సులు



**(జర్నలిస్ట్ డైరీ) /ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం**
క్రమశిక్షణ,దృఢ సంకల్పం,పట్టుదల ఉంటే మనిషి సాధించలేనిదంటూ ఏది ఉండదని ఆచరణలో నిరూపించింది సరస్వతి పుత్రిక దీప్తి.పేద కుటుంబానికి చెందిన దీప్తి కష్టపడి చదివి కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది.రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర సోమవారం ఖమ్మం బురహాన్ పురంలోని తన క్యాంప్ కార్యాలయంలో చదువుల తల్లి దీప్తిని శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు,ఆశీస్సులు అందజేశారు.ఖమ్మం నగరంలోని బొక్కలగడ్డకు చెందిన హమాలీ పని చేసే వెంకటేశ్వర్లు-మంగ దంపతుల కూతురు దీప్తి మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలలో చదివి పదవ తరగతిలో 10/10, ఇంటర్మీడియట్ లో 1000కి 958 మార్కులు సాధించి అందరి ప్రశంసలు అందుకుంది.ఈ సందర్భంగా దీప్తిని ఎంపీ రవిచంద్రతో కలిసి టీఆర్ఎస్ నాయకులు తోట రామారావు తదితర ప్రముఖులు ప్రశంసించారు,శుభాకాంక్షలు తెలియజేశారు.

# వరి ధాన్యం కనుగోలు కేంద్రం ప్రారంభం



**వెల్దండ, అక్టోబర్ 21 (జర్నలిస్ట్ డైరీ)**
వెల్దండ మండల ప్రాథమిక సహకార కేంద్రంలో సింగల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కరరావు గారు వరి ధాన్యం కనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, మండల రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా, సన్న కారు చిన్న కారు రైతులకు సహాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో వైస్ చైర్మన్ రాజేందర్ రెడ్డి, సింగల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ వెంకటయ్య గౌడ్, సింగల్ విండో డైరెక్టర్ శేఖర్, బర్కత్ పల్లి ఉప సర్పంచ్ నరసింహ, తిరుపతి రెడ్డి, ఎర్ర శీను, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

# గీత కార్మికుల భద్రతకే కాటమయ్య కిట్లు





(జర్నలిస్ట్ డైరీ) ప్రతినిధి/వరంగల్: కల్లుగీత కార్మికుల భద్రతకే కాటమయ్య కిట్లు అందిస్తున్నామని రాష్ట్ర అటవీ,పర్యావరణ,దేవదాయ శాఖ మంత్రి కొండ సురేఖ అన్నారు.సోమవారం వరంగల్ ఏనుమాముల మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వరంగల్ తూర్పు నియోజకవర్గ కాటమయ్య రక్షక కవచ కిట్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా తో కలిసి గీత కార్మికులకు కిట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో కులవృత్తులకు అన్ని విధాలా చేయూత అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.బలహీనవర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి తెలిపారు. కల్లు గీత కార్మికుల ప్రాణాలకు ప్రజా ప్రభుత్వ అభయ హస్తం కాటమయ్య రక్షణ కవచమని అన్నారు.కల్లు గీత కార్మికుల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసిందని, ఇక నుంచి కార్మికుడు చెట్టుపై నుంచి కిందపడి ప్రాణాలు కోల్పోకుండా ఉండేందుకు ప్రత్యేక కిట్లను తయారు చేసిందని,కాటమయ్య రక్షణ కవచం పేరిట 6 పరికరాలున్న కిట్‌ను సిద్ధం చేసిందని అన్నారు.తెలంగాణ రాష్ట్ర కల్లుగీత కార్మికుల సహకార ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 10 వేల మంది గీత కార్మికులకు కాటమయ్య కిట్లను పంపిణీ చేస్తున్నామని, వరంగల్ జిల్లాలో 55 లక్షల రూపాయల వ్యయంతో 550 మంది కల్లుగీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచాలు అందిస్తున్నట్లు,అందులో వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 116 లబ్ధిదారులకు భద్రత కిట్లను పంపిణీ చేయడం జరుగుతున్నదన్నారు.ఇది నిరంతర ప్రక్రియ అని అన్నారు.గీత కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే 25 వేల రూపాయలు,ప్రమాదం జరిగితే 15 వేల రూపాయలు పరిహారం,ప్రమాదానికి గురై మరణించిన గీత కార్మికులకు రూ.5 లక్షలు ఎక్స్ గ్రేషియా ఇస్తున్నట్లు మంత్రి తెలిపారు. ముందుగా గీత కార్మికుడు ప్రయోగాత్మకంగా కాటమయ్యా భద్రత కిట్ ధరించి చెట్టు ఎక్కిన తీరును మంత్రి,కలెక్టర్ లు పరిశీలించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పోశాల పద్మ, భోగి సువర్ణ, చింతాకుల అనిల్, ఉమా దామోదర్ యాదవ్, జిల్లా బిసి సంక్షేమ అధికారి పుష్పాలత, జిల్లా ఆబ్కారీ అధికారి చంద్రశేఖర్,గౌడ సంఘ నాయకులు నర్సయ్య, శ్రీనివాస్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## నక్క దాడిలో 9 మేకపిల్లల మృతి






వెల్దండ, అక్టోబర్ 21 (జర్నలిస్ట్ డైరీ) మండల కేంద్రానికి చెందిన మోర చంద్రమౌళి వ్యవసాయ పొలంలో నక్కలు 9 మేకపిల్లలను చంపాయి. ఆదివారం జూపల్లి సంతలో కొనుగోలు చేసిన మేకపిల్లలను రాత్రి పొలంలోని దొడ్డిలో ఉంచిన ఆయన, సోమవారం ఉదయం వాటిని చూడగా, మేకపిల్లలు చెల్లాచెదురుగా మృతి చెందిన దృశ్యం కనబడింది. ఈ ఘటనపై నాగర్‌కర్నూల్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ లలితను అప్రమత్తం చేయగా, ఆమె సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా చేశారు. ప్రాథమిక విచారణలో నక్కల దాడి కారణంగా మేకపిల్లలు మృతిచెందినట్లు నిర్ధారణ అయ్యింది. బాధిత రైతు మోర చంద్రమౌళి కి నష్టపరిహారం అందించేందుకు గ్రామ కార్యదర్శి మరియు వెటర్నరీ డాక్టర్ నుండి సర్టిఫికెట్ తీసుకురావాలని, తదుపరి చర్యలు తీసుకుంటామని లలిత వెల్లడించారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



(జర్నలిస్ట్ డైరీ) ప్రతినిధి/ భువనగిరి నియోజకవర్గం
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని ఖిలానగర్ చెందిన తోటకూరి చంద్రయ్య ఆకస్మికంగా మృతి చెందారు ఖిలానగర్ ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో 22,900/ వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మె లింగయ్య (పెద్దకుర్మ) బత్తిని దేవేందర్ దయ్యాలా వినోద్,ఎమ్మె కుమార్,ఎమ్మె శేఖర్, కౌడే కృష్ణ,ఎడవల్లి అనిల్, ఎమ్మె వెంకటేష్,ఎమ్మె నవీన్,పబ్బు శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ గారిని కలిసి ఆశీస్సులు తీసుకున్న ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



కుత్బుల్లాపూర్ అక్టోబర్ 21,(జర్నలిస్ట్ డైరీ)
ఎర్రవెల్లి లోని వ్యవసాయ క్షేత్రంలో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ ని ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పుట్టినరోజు సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంభీ పూర్ రాజు, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు తదితరులు పాల్గొన్నారు.

## నిశ్చితార్థ కార్యక్రమంలో పాల్గొన్న గాంధీ



జోగులాంబ గద్వాల, అక్టోబర్ 21 (జర్నలిస్ట్ డైరీ): గద్వాల జిల్లా ధరూర్ మండలం పెద్ద సౌరన్న చిన్న సౌరన్న కోడలు నిశ్చితార్థ కార్యక్రమంలో త్యాగదొడ్డి గ్రామ ఉప సర్పంచ్ గడ్డం గోపాల్ అలియాస్ గాంధీ పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

## విద్యా రంగ సమస్యలను గాలికి వదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం...

-ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్



(జర్నలిస్ట్ డైరీ) పరకాలటీ
సోమవారం రోజున ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పరకాల పట్టణంలో తెలంగాణ రాష్ట్రంలో 8000 కోట్లకుపై పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీఎంబర్స్మెంట్లను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులతో కలిసి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 2019 నుండి ఇప్పటివరకు స్కాలర్షిప్ ఫీజు డైమండ్స్ మెంట్లు విడుదల కాక ప్రింటింగ్ లో ఉండడంతో ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుకుంటున్నటువంటి విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని తమ కోర్సులు పూర్తి చేసుకున్న తర్వాత సర్టిఫికెట్లు తీసుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారని వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పరకాల మండల అధ్యక్షుడు మడికొండ ప్రశాంత్, మండల నాయకుడు హేమంత్, పట్టణ అధ్యక్షుడు బొచ్చు ఈశ్వర్, పట్టణ కార్యదర్శి సాయి తేజ, వరుణ్, వినయ్, అరుణ్, శాంతి కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

## తాండ్ర గ్రామంలో రోడ్డు ప్రారంభించిన కసిరెడ్డి





కల్వకుర్తి, అక్టోబర్ 21 (జర్నలిస్ట్ డైరీ)
తాండ్ర గ్రామంలో సోమవారం స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కల్వకుర్తి బ్లాక్ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు ఆశాదీప్ రెడ్డి కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, సొంత డబ్బుతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు.గ్రామంలోని ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డును కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఆశాదీప్ రెడ్డి మాల కమిటీ హాల్ను కూడా ప్రారంభించారు. గ్రామస్తుల అర్షద్వానాల మధ్య ఆశాదీప్ రెడ్డి వర్ధిల్లాలి, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆశాదీప్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామంలో ఎలాంటి సమస్య అయినా పరిష్కరించడానికి ఎల్లప్పుడూ ముందుంటానని, మహిళలు, వృద్ధులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

## మోటకొండూర్-చాడ బీటీ రోడ్డుకు శంకుస్థాపన

-చేసిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



(జర్నలిస్ట్ డైరీ) /ఆలేరు ఆర్సీ :
యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్ మండలంలో సోమవారం రోజు ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మోటకొండూర్-చాడ గ్రామాల మధ్య బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకి మోటకొండూర్ మండల నాయకులు, చాడ గ్రామ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఐలయ్య మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పనులు చేయడమే లక్ష్యంగా చేసుకొని ముందుకి వెళ్తున్నాననీ అన్నారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెసు పార్టీ కార్యనిర్వాక అధ్యక్ష కార్యదర్శులు,మార్కెట్ కమిటీ చైర్మన్ ,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పచ్చిమట్ల మదార్ గౌడ్,పట్టణ అధ్యక్ష కార్యదర్శులు,ఉప సర్పంచుల పోరం మాజీ మండల అధ్యక్షుడు ఎల్మీనేటి జంగారెడ్డి, నాయకులు నవీన్ రెడ్డి, వంగపల్లి శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.



# పెళ్లిపనులతో నటి శోభిత బిజీ

## మొదలైన హల్దీ కార్యక్రమం

తెలుగు నటి శోభితా ధూళిపాళ్ల తన పెళ్లి పనులు మొదలుపెట్టింది. టాలీవుడ్ నటుడు నాగచైతన్య, శోభితా ధూళిపాళ్ల త్వరలో పెళ్లి పీటలు ఎక్కనున్న విషయం తెలిసిందే. సమంతతో విడిపోయిన అనంతరం శోభితాతో ప్రేమలో పడ్డాడు నాగా చైతన్య. రీసెంట్‌గా వీరి ఎంగేజ్‌మెంట్ కూడా జరిగింది. నవంబర్‌లో వీరి పెళ్లి జరుగనున్నట్లు సమాచారం. ఇదిలావుంటే తన పెళ్లికి సంబంధించి ఇప్పటినుంచే పనులు మొదలు పెట్టింది ఈ భామ. తాజాగా తన హల్దీ వేడుక కోసం కుటుంబ సభ్యులతో కలిసి వైజాగ్‌లోని తన ఇంట్లో పసుపు దంచుతున్న ఫొటోలను సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అయితే పసుపు దంచడం దగ్గరికి వచ్చిందంటే పెళ్లి కూడా త్వరలోనే ఉంటుందని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. సినిమాల విషయానికి వస్తే.. లవ్ సితార అంటూ రీసెంట్‌గా ప్రేక్షకుల ముందుకు వచ్చింది శోభితా ధూళిపాళ్ల . ఈ చిత్రం ప్రస్తుతం జీ5లో స్ట్రీమింగ్ అవుతుంది. నాగ చైతన్య విషయానికి వస్తే.. ప్రస్తుతం చందూ మొండేటితో తండేల్ అనే సినిమా చేస్తున్నాడు. ఈ సినిమాలో సాయి పల్లవి కథానాయికగా నటిస్తుంది.

# ప్రత్యేక ఆకర్షణగా ర్యాంప్‌పై మృణాళ్ ఠాకూర్ మెరుపులు



ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న భామల్లో టాప్ ప్లేలో ఉంటుంది బాలీవుడ్ భామ మృణాళ్ ఠాకూర్ . బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉంది ఈ మరాఠీ ముద్దుగుమ్మ. ఎప్పటికప్పుడు మెస్మరైజింగ్ లుక్స్‌తో సోషల్ మీడియాను షేక్ చేస్తుంది మృణాళ్ ఠాకూర్. ఈ బ్యూటీ తాజాగా బాంబ్వే టైమ్స్ ఫ్యాషన్ వీక్ 2024లో సందడి చేసింది.సిల్వర్ కోటెడ్ ఫ్లోరల్ డిజైన్డ్ వైట్ కాస్ట్యూమ్స్‌లో హొయలుపోతూ ర్యాంప్ వాక్ చేసింది. అనూష రెడ్డి స్టన్నింగ్ అవుట్ ఫిట్‌లో ధగ ధగ మెరిసిపోతూ ఫ్యాషన్ వీక్‌కే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ ఫొటోలు, విజువల్స్ ఇప్పుడు నెటిజన్లకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి మృణాళ్ ఠాకూర్ ప్రస్తుతం హిందీలో లో నటిస్తుండగా.. పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. కాగా కొన్ని రోజుల క్రితం పాపులర్ కోసం కెమెరాకు స్టన్నింగ్ ఫోజులివ్వగా.. బ్లాక్ అండ్ గ్రీన్ కాస్ట్యూమ్స్‌లో మెరిసిపోతున్న మృణాళ్ ఠాకూర్ స్టిల్స్ ఇప్పటికే నెట్టింటిని షేక్ చేస్తున్నాయి.





# వరుణ్ తేజ్ 'మట్కా' నుంచి సలోని ఫస్ట్ లుక్ రిలీజ్

రాయే రాయే రాయే రాయే రాయే సలోని జాము రాతిరేలా సందుచూసి జంప్ జిలాని అంటూ కుర్రకారుని ఉర్రుతలు ఊగించిన టాలీవుడ్ భామ సలోనీ చాలా రోజులకు తెరపై కనిపించబోతుంది. ఆమె కీలక పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం మట్కా . వరుణ్ తేజ్ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రం నుంచి తాజాగా సలోని ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ చిత్రంలో సలోని పద్మ అనే పాత్రలో నటించనున్నట్లు చిత్రబృందం తెలిపింది.మెగా హీరో వరుణ్ తేజ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు పలాస 1978 సినిమా ఫేం కరుణ కుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. విజేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తుంది. ఈ సినిమాను నవంబర్ 14న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రబృందం ఇప్పటికే ప్రకటించింది. 1958-1982 మధ్య కాలంలో దేశాన్ని తీవ్రంగా ప్రభావితం చేసిన ఒక వాస్తవ సంఘటనను ఆధారం చేసుకొని ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు చిత్రయూనిట్ తెలిపింది. వైజాగ్ నేపథ్యంగా సాగే ఈ పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌లో వరుణ్ నాలుగు భిన్న గెటప్పుల్లో కనిపించనున్నారు. నవీన్ చంద్ర, కిశోర్, రవీంద్ర విజయ్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు జీవి ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు.

# 23న ప్రభాస్ బర్త్‌డే వేడుకలు

## భారీ ఏర్పాట్లలో అభిమనా సంఘాలు

ప్రస్తుతం టాలీవుడ్‌లో మోస్ట్ సక్సెస్‌ఫుల్ హీరో ఎవరంటే వెంటనే గుర్తొచ్చేది పాన్ ఇండియా స్టార్ ప్రభాస్. గతేడాది సలార్‌తో బ్లాక్ బస్టర్ అందుకున్న ఇతడు.. లేటెస్ట్‌గా కల్కి 2898 ఏడీతో మరో బ్లాక్ బస్టర్‌ను ఖాతాలో వేసుకున్నాడు. ప్రస్తుతం ఈ రెండు సినిమాలకు సీక్వెల్స్ రానున్నాయి. అయితే సినిమాలతో పాటు ప్రభాస్ మరో మూవీ చేస్తున్న విషయం తెలిసిందే. టాలీవుడ్ డైరెక్టర్ భలే భలే మొగాడివోయ్ ఫేమ్ మారుతి దర్శకత్వంలో ప్రభాస్ చేస్తున్న తాజా చిత్రం రాజా సాబ్ . ప్రస్తుతం ఈ సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. అయితే అక్టోబర్ 23న ప్రభాస్ బర్త్‌డే కావడంతో ఇప్పటినుంచే వేడుకలు మొదలుపెట్టారు అభిమానులు. ఇక బర్త్‌డే రోజు అతడు నటించే సినిమాల నుంచి అప్‌డేట్‌లు కూడా రానున్నాయి. ఇదిలావుంటే డార్లింగ్ బర్త్‌డే కానుకగా రాజాసాబ్ నుంచి స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేయబోతు న్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సినిమాలో ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. రిద్ధి కుమార్, సంజయ్ దత్ కీలక పాత్రల్లో మెరవనున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్?పై టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అగ్ర కథానాయకుడు ప్రభాస్ వేదికలపై చాలా తక్కువ మాట్లాడతారు. ఇక ఇంటర్వ్యూలు, టాక్ షోలకు రావడం కూడా అరుదే. అలాంటిది చాలా రోజుల తర్వాత 'సిరివెన్నెల' సీతారామశాస్త్రిని గుర్తు చేసుకుంటూ నిర్వహిస్తున్న 'నా ఉచ్ఛ్వాసం కవనం ' కార్యక్రమానికి విచ్చేసి సందడి చేశారు. 'లిరిక్ దాని అందం. అర్థం. రాసేవాళ్లకు ఉన్న విలువ ఏంటో తెలియజెప్పిన వ్యక్తి 'సిరివెన్నెల' అని కొనియాడారు. ఆదివారం ఉదయం 9గంటలకు ఈటీవీలో ఈ కార్యక్రమం ప్రసారం కానుంది. ఓటీటీ వేదిక ఈటీవీ విన్‌లోనూ స్ట్రీమ్రింగ్ కానుంది.



# అభిమానులతో సూర్య, దిశాపటానీ సెల్ఫీ..

## ఇంతకీ కంగువ టీం ఎక్కడుందో తెలుసా..?



కోలీవుడ్ స్టార్ హీరో సూర్య నటిస్తోన్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా కంగువ . సూర్య 42వ ప్రాజెక్ట్‌గా తెరకెక్కుతున్న ఈ మూవీకి శివ దర్శకత్వం వహిస్తుండగా.. బాలీవుడ్ భామ దిశాపటానీ ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తుండగా.. బాబీ డియోల్ విలన్‌గా నటిస్తున్నాడు. కంగువ నవంబర్ 14న తెలుగు, తమిళంతోపాటు పాన్ ఇండియా స్థాయిలో గ్రాండ్‌గా విడులవుతున్న నేపథ్యంలో మేకర్స్ ప్రమోషన్స్‌లో సూర్య టీం బిజీగా ఉంది. సూర్య కంగువ టీం ప్రమోషన్స్‌లో భాగంగా నార్తిండియా టూర్‌లో బిజీగా ఉంది. ఇందులో భాగంగా నేడు ఢిల్లీలో సందడి చేసింది. ప్రమోషనల్ ఈవెంట్ ఏర్పాటు చేసిన కాలేజ్ గ్రౌండ్‌కు అభిమానులు, మూవీ లవర్స్ పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సూర్య, డిశాపటానీ, బాబీ డియోలో స్టేజీపై నుంచి అభిమానులతో కలిసి సెల్ఫీ దిగి సందడి చేశారు. ఇప్పుడీ ఫొటోలు, వీడియోలు నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి.


Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s. SRI DIVYA PRINTERS, Plot No.33 & 34, 2nd Floor, Vasthu Colony, LB. Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10, Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana -500035. Chief Editor: V.N.RAJU RNI. No. TELTEL/2015/62524. Cell: 8499094183 / 9966443465.